ఈనాడు
విశాఖపట్నం
గురువారం 17 అక్టోబరు 2024 సిటీ 7

కాకి లెక్కలు.. అక్రమాలకు రెక్కలు!!

వైకాపా హయాంలో జరిగిన పనులకు 'స్థాయీ' సమావేశాల్లో ఆమోదం



వైకాపా హయాంలో, ఎన్నికల కోడ్ వేళలో జరిగిన పనులకు జీవీఎంసీ 'స్థాయీ సంఘం'లో పచ్చజెండా ఊపేశారు. తొలి సమావేశం కొనసాగింపుగా గత నెల 17వ తేదీ జరిగిన 'స్థాయీ'లో కేవలం గంటన్నర వ్యవధిలో 122 అంశాలను ఆమోదించడం గమనార్హం. ఆ తర్వాత జరిగిన కౌన్సిల్, స్థాయీ సమావేశాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మార్చి నుంచి సెప్టెంబరు వరకు గతంలో దక్కించుకున్న గుత్తేదారులకే అదే రేటుకు టెండరు కొనసాగించారు. ఈ పనులు క్రమబద్ధీకరించడానికి పెట్టిన దస్త్రాలకు పర్సంటేజీల పైరవీలతో ఆమోదం పొందినట్లు విస్తృతంగా చర్చసాగుతోంది.

–ఈనాడు, విశాఖపట్నం

ఎంత మానవత్వమో?: 'పారిశుద్ధ్య కార్మికులు, కూలి ప్రాతిపదిక కార్మికులకు చెల్లించాల్సిన జీతభత్యాలు మానవతా దృక్పథంతో ఆమోదిస్తున్నాం' అంటూ స్థాయీ సంఘ సభ్యులు చెప్పుకొచ్చారు. గతంలో వైకాపా కార్పొరేటర్లు, ఓ ఫ్లోర్ లీడర్ ఈ వ్యవహారంలో చక్రం తిప్పారు. 700-800 మంది కార్మికులను కూలి ప్రాతిపదికన నియమించారు. రోజుకు ఒక్కో కార్మికుడికి రూ.500 చెల్లిస్తారు.

ఉదయం 5.30 గంటలకే పారిశుద్ధ్య కార్మికుల ఐరిస్ హాజరు తీసుకుంటే వారు పనిలోకి వెళతారు. కానీ, కూలి ప్రాతిపదికన వచ్చే కార్మికులకు ఇలాంటి హాజరేమీ ఉండదు. దీంతో బయటి కార్మికులతో పని చేయించకుండానే లెక్కలు చూపిస్తూ నెలకు రూ.40లక్షల చొప్పున రూ.కోట్లల్లో పక్కదారి పట్టించారన్న ఆరోపణలున్నాయి. అలాంటి కాకిలెక్కలకు మానవతా దృక్పథం అనే మాట జోడించి స్థాయీ సభ్యుల ఊ కొట్టడం చర్చనీయాంశంగా మారింది.

- ఈ కార్మికులకు జీతభత్యాలు ఇచ్చే బాధ్యత వైకాపా హయాంలో 2% కమీషను చెల్లిస్తూ అనుకూల మహిళా సంఘాలకు అప్పగించారు. ఆప్కోస్ పరిధిలో లేని కొందరు కార్మికుల జీతాలు ఇప్పటికీ అదే మహిళా సంఘాల ద్వారా చెల్లిస్తున్నారు.

తొలుతే వద్దని...తరువాత ఆమోదం: రూ.50లక్షల పనులను రూ.5 లక్షల్లోపుగా పనులుగా విభజించి నామినేషన్‌లో పద్ధతిలో వైకాపా హయాంలో గుత్తేదారులకు అప్పగించారు. ఆ తరహాలో ఇచ్చిన నామినేషన్ అంశాలను స్థాయీ సంఘ సభ్యులు మొదటి వ్యతిరేకించి, ఆ తర్వాతి సమావేశంలోనే ఆమోదించేశారు. వాస్తవానికి మొదటి స్థాయీ సమావేశంలో తిరస్కరించినవి రెండో సమావేశంలో పెడతారు. మళ్లీ తిరస్కరణకు గురైతే కౌన్సిల్‌కు పంపుతారు. అయితే కౌన్సిల్ వరకు వెళ్లకుండా స్థాయీ రెండో సమావేశంలోనే ఇలాంటివి ఆమోదించడం గమనార్హం.

- ప్లాస్టిక్ వాడకం నియంత్రించేందుకు వీలుగా వైకాపా హయాంలో 36 మంది వార్డు వాలంటీర్లతో ప్రతి జోన్‌కు ఒక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరికి మార్చి నుంచి జూన్ వరకు ఒక్కొక్కరికి నెలకు రూ.15వేల చొప్పున జీతభత్యాలు చెల్లించాలంటూ చివరి స్థాయీ సంఘం అజెండా అంశాల్లో పెట్టడం గమనార్హం.

స్థాయీ సంఘ సమావేశాల్లో ఏం జరిగిందంటే..

తేదీ	అంశాలు	ఆమోదం	విలువ (రూ. కోట్లు)
03/10	124	122	₹16.751
20/9	156	121	₹15.44
17/9	280	124	₹20.06

ఇంటిదొంగల గుట్టురట్టు.. నలుగురి అరెస్టు | 8వ పేజీలో | తెరవెనుక అక్రమాల 'భూ'తం! | ఫ్రీహోల్డ్ భూముల్లో మతలబులెన్నో..



సాగర జలాల్లో మలబార్-2024 నౌకాదళం విన్యాసాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం నౌక డెక్‌పై దిగుతున్న ఎయిర్‌క్రాఫ్ట్. –న్యూస్‌టుడే, సింధియా

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ గురువారం విశాఖ రానున్నారు. రాత్రి 10.15 గంటలకు ప్రత్యేక విమానంలో నగరానికి చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి నేరుగా రాక్‌డేల్ లేఅవుట్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు వెళతారు. రాత్రికి అక్కడే బసచేస్తారు. 18న ఉదయం 10.30 గంటలకు ఎన్టీఆర్ భవన్ నుంచి బయలుదేరి 10.45గంటలకు జిల్లా కోర్టుకు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 1.15గంటల నుంచి ఎన్టీఆర్ భవన్‌లో మంత్రి అందుబాటులో ఉండనున్నారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.

జన్మభూమి స్ఫూర్తి కొనసాగించాలని కోరా!

ముఖాముఖి

ఈనాడు–విశాఖపట్నం; న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్



- అమెరికా పర్యటనలో ప్రవాసుల ఆదరణ అపూర్వం
- వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధం
- 'ఈనాడు'తో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు

పుట్టిన ఊరు, ప్రాంతం అభివృద్ధి కోసం గతంలో మాదిరిగానే 'జన్మభూమి' స్ఫూర్తిని కొనసాగించాలని ప్రవాసాంధ్రులను కోరినట్లు శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం 50వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా అమెరికా వెళ్లారు. వాషింగ్టన్ డీసీ, లీస్‌బర్గ్ అట్లాంటా, డాలస్, న్యూజెర్సీ రాష్ట్రాల్లో పర్యటించారు. ఇటీవలే సొంత నియోజకవర్గానికి చేరుకుని పల్లె పండగ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తన అమెరికా పర్యటన, అక్కడి తెలుగువారు చూపిన ఆదరణ, వారి ఆకాంక్షల గురించి 'ఈనాడు'కు వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి..: ప్రవాసాంధ్రుల్లో చాలామంది రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించేందుకు సుముఖంగా ఉన్నారు. ఏపీలో కంపెనీల ఏర్పాటుకు ముందుకొచ్చేవారికి ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో రాయితీలు ఇస్తున్న విషయం వారికి వివరించా. ఎన్నారైలు స్థాపించబోయే పరిశ్రమలకు అవసరమైన భూమి, ఇతర రాయితీలను త్వరితంగా అందించేందుకు ప్రభుత్వం సంసిద్ధంగానే ఉందని ఔత్సాహికులకు తెలియజేశా.

సేవా కార్యక్రమాలు చేపట్టాలని..

అమెరికాలో పర్యటించినప్పుడు వేలాది మంది ప్రవాసాంధ్రులను కలిశాను. వారిలో ఓ కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రానికి పూర్వవైభవం వస్తుందని వారు విశ్వసిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం కోసం గతంలో జన్మభూమి పేరుతో కార్యక్రమాలు చేపట్టగా ఎంతోమంది ముందుకొచ్చారు. ఇప్పుడు కూడా అదే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టడానికి సహకరించాలని కోరాను. అమెరికాలో పెద్ద సంఖ్యలో తెలుగువారున్నారు. వారంతా తమతమ ఊళ్లలో పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఉదారంగా సాయం చేయాలి. ఇలా చేస్తే తక్కువ కాలంలోనే ఎక్కువ అభివృద్ధి చూపడానికి అవకాశం ఉంటుందని గుర్తుచేశాను. నా ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించారు. తమ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పడం చాలా సంతోషం అనిపించింది.

అప్పుడు కోడెల.. ఇప్పుడు నేను..: 'అమెరికా పర్యటన ఎంతో సంతృప్తినిచ్చింది. తెలుగువారు బాగా ఆదరించారు. వారి ఇళ్లకు వెళ్లి ఒకట్రెండు రోజులు అక్కడే గడిపాం. నాలుగైదు రాష్ట్రాల్లో వేలాది మంది ప్రవాసాంధ్రులతో సమావేశాలు నిర్వహించాం. తెలుగు సాంస్కృతిక సంఘం 40వ వార్షికోత్సవానికి అప్పట్లో స్పీకర్‌గా ఉన్న కోడెల శివప్రసాద రావు ముఖ్య అతిథిగా వెళ్లారు. రజతోత్సవానికి నేనూ స్పీకర్‌గా పాల్గొనడం ఆనందం కలిగించింది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో రాక్షస పాలన చూసిన ఎన్నారైలు ఎలాగైనా ఇక్కడి పాలన మారాలని, మళ్లీ చంద్రబాబు రావాలని ఎంతగానో తపించారు. రూ. లక్షల ఖర్చు పెట్టుకుని సొంతూళ్లకు వచ్చి ఓటేసి వెళ్లారు. అమెరికాలో ఉంటూనే ఇక్కడి ఓటర్లను చైతన్యం చేశారు. వారు అందించిన సహకారాన్ని మర్చిపోలేం. రాష్ట్రంలో వారికి తగిన గౌరవాన్ని అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం'అని సభాపతి వివరించారు.

దసపల్లా భూముల్లో... కుట్రదారులెవరు?

- విచారణ చేపట్టిన జిల్లా యంత్రాంగం
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో నగరంలో విలువైన స్థలాలు, భూములు కీలక నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. వాటిల్లో దసపల్లా భూములు కూడా ఉన్నాయి. ఈ వ్యవహారం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ భూముల విషయంలో జరిగిన కుట్రను వెలికితీయడానికి నడుంబిగించింది. ఈ మేరకు సమగ్రంగా నివేదిక రూపొందించి అందజేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరింది. దసపల్లా భూములకు 22ఏ నుంచి(నిషేధిత



దసపల్లా భూములు

జాబితా) మినహాయింపు ఇవ్వడానికి దారి తీసిన పరిస్థితులు, అప్పట్లో జిల్లా అధికారులు వ్యవహరించిన తీరుతెన్నులు తదితర అంశాలపై యంత్రాంగం నివేదిక సిద్ధం చేస్తోంది. త్వరలో ప్రభుత్వానికి దానిని అందజేయనున్నారు.

తెదేపా పాలనలో రక్షణ..

విశాఖ నగర పరిధి 1027, 1928, 1196, 1197 సర్వే సంఖ్యల్లో దసపల్లా భూములు విస్తరించి ఉన్నాయి. అందులో 15 ఎకరాలను 22ఏ నుంచి మినహాయింపు ఇస్తూ వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా భూముల్లో ప్రభుత్వానికి చెందిన నీటి ట్యాంకర్లు, రహదారులు, పార్కులను మాత్రం 22ఏలోనే కొనసాగిస్తూ స్థలాలు, కట్టడాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. దాదాపు 30ఏళ్లకుపైగా దసపల్లా భూ వ్యవహారం కోర్టుల్లో నలిగింది. 2014 నుంచి 2019 వరకు తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వాటి రక్షణకు చర్యలు తీసుకుంది. ఆ క్రమంలో నిషేధిత భూముల జాబితాలో చేర్చింది. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా 22ఏ నుంచి మినహాయింపు ఇవ్వలేదు.

వైకాపా హయాంలో భక్షణ..

వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ కీలక నేత కన్ను రూ.2వేల కోట్ల విలువ చేసే దసపల్లా భూములపై పడింది. తమ కుటుంబ సభ్యుల సంస్థకు అవి దక్కేలా చక్రం తిప్పారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు అనుగుణంగా నాటి జిల్లా అధికారులు వ్యవహరించారు. ఫలితంగా 22ఏ పరిధిలోని భూములకు చెందిన ప్రైవేటు వ్యక్తులతో ఓ సంస్థ డెవలప్‌మెంట్ ఒప్పందం చేసుకుంది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే 22ఏ నుంచి మినహాయింపులు రావడం గమనార్హం. అడ్డగోలుగా నిబంధనల ఉల్లంఘన జరిగినప్పటికీ నాటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. అంతే కాకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రక్రియను వేగంగా పూర్తి చేసింది. ఇప్పుడు ఆయా అంశాలపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తుండడంతో దసపల్లా భూముల వ్యవహారం ఏ మలుపులు తిరుగుతుందో అనే చర్చ నడుస్తోంది.

ఇంటిదొంగల గుట్టురట్టు.. నలుగురి అరెస్టు

రూ. 1.15 కోట్ల విలువైన పల్లాడియం లోహం పౌడర్ స్వాధీనం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కార్బన్ ఉత్ప్రేరకాన్ని తయారు చేయడానికి ఫార్మా కంపెనీలో వాడే ఖరీదైన పల్లాడియం లోహం పౌడర్ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. కంపెనీలో పనిచేస్తున్న వారే చోరీకి పాల్పడినట్లు గుర్తించి నలుగురిని అరెస్ట్ చేసి వీరి నుంచి రూ. 1.15 కోట్ల విలువైన ఈ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక బుధవారం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పరవాడలోని రవీంద్ర హిరేయస్ కంపెనీలో ఈనెల 9న పల్లాడియం లోహానికి చెందిన పౌడర్‌ను చోరీ చేశారు. ఖరీదైన దీనిని ఫార్మా కంపెనీలో వినియోగిస్తారు. దీనిని డ్రయ్యర్‌లో ఉంచి ఆరబెడతారు. ప్రొడక్షన్ బ్లాక్‌లో ఉన్న డ్రయ్యర్‌ను రాత్రి వేళలో ఆరబెట్టడం కోసం 4.2 కేజీల పౌడర్‌ను 9వ


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దీపిక


స్వాధీనం చేసుకున్న పల్లాడియం లోహం

తేదీ సాయంత్రం 4 గంటలకు ప్లాంట్‌లో ఉంచి తాళం వేశారు. మర్నాడు చూడగా చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై ఈ నెల 12న కంపెనీ ప్రతినిధి వరదరాజన్ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై విచారణ చేసి, కంపెనీలో పనిచేస్తున్న వారే చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. చోరీకి పాల్పడ్డ చింతకాయల రాజు, ముద్దనూరు వినీత్ వర్మ, చింతకాయల మురళి, కనుమూరి రామచంద్రరాజును 15న తానాం శ్మశానవాటిక వద్ద అరెస్ట్ చేసి వీరి నుంచి పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అత్యాశకు పోయి కంపెనీలో పనిచేస్తున్న వారే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. తొమ్మిదో తేదీ రాత్రి గోడదూకి పరిశ్రమలోకి వెళ్లి మారు తాళంతో తలుపు తెరచి చోరీ చేసినట్లు విచారణలో తేలింది. పరిశ్రమల్లో సీసీ టీవీల ఏర్పాటుతో పాటుగా అవి పనిచేస్తున్నవి లేనివీ పర్యవేక్షణ చేయాలని ఎస్పీ సూచించారు. ప్రైవేటు కంపెనీల్లో వివిధ ప్రాంతాల నుంచి పనిచేయడానికి వచ్చే వారి నడవడిక, క్రిమినల్ కేసులపై ఆరా తీసి ధ్రువీకరణ చేస్తామని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, సీసీఎస్ ఎస్సై రమేశ్, పరవాడ స్టేషన్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

తెరవెనుక అక్రమాల 'భూ'తం!

ఫ్రీహోల్డ్ భూముల్లో మతలబులెన్నో..

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఆనందపురం

విశాఖ జిల్లాలో భూ అక్రమ వ్యవహారాల్లో వాస్తవాలు బయటపడకపోవడంపై అనుమానాలు రేగుతున్నాయి. ఎసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పిస్తూ వైకాపా ప్రభుత్వ హయాంలో ఉత్తర్వులు వచ్చాయి. నిబంధనల మేరకు కొన్ని భూములను నిషిద్ధ జాబితా (22ఏ) నుంచి తప్పించారు. దీనికి ముందే ఆ పార్టీ పెద్దలు, ఆ నాటి ఉన్నతాధికారులు కొందరు విలువైన భూములను పేదల నుంచి తక్కువ ధరకు కొనుగోలుచేశారు. దీంతో పేదల కంటే వైకాపా పెద్దలే బాగా లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం రాగానే అవకతవకలు గుర్తించేందుకు 'ఫ్రీహోల్డ్ భూముల' పరిశీలనకు విచారణ కమిటీలు వేసింది. అయినా నాటి అక్రమాలు బయటకు రాకుండా కొందరు తొక్కిపెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. విచారణ కొనసాగిన తీరుపై కొన్ని సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

● విశాఖ జిల్లాలో దాదాపు 626 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశారు. వీటిల్లో లోపాయికారి ఒప్పందాలతో చేతులు మారిన భూములు ఎక్కువగానే ఉన్నాయి. ఇటీవల భూస్వరూపాలు మారిన వాటి మీద దృష్టిసారిస్తే అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. రైతుల చేతుల్లో ఉన్నంతకాలం వివిధ రకాల సాగు భూములుగా, తోటలుగా ఉండేవి. చేతుల మారాక కొన్ని చోట్ల తోటలు నరికేసి చదును చేశారు.

● ఆనందపురం మండలం గండిగుండంలో రైతులు జీడిమామిడి సాగు చేశారు. పెద్దల చేతుల్లోకి వెళ్లాక కొబ్బరి మొక్కలు నాటారు. మరో వైపు భారీగా నేలను తవ్వి వదిలేశారు. కణమాంలో ఫ్రీహోల్డ్ జరిగిన భూముల్లో ప్రహరీ నిర్మించి పూర్తిస్థాయిలో ఆధీనంలోకి తీసుకున్నారు. ఇటువంటి చోట అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి రావొచ్చు.


గండిగుండంలో స్వరూపం మారిన భూమి

కమిటీ సంఖ్య	తనిఖీ చేసిన విస్తీర్ణం (ఎకరాలు)	మండలం
1	140.95	ఆనందపురం
2	134.06	ఆనందపురం
3	133.219	ఆనందపురం
4	74.81	పద్మనాభం
5	70.931	పద్మనాభం
6	52.513	భీమిలి
7	20.038	పెందుర్తి

✦ ఆనందపురం మండలంలోని కొన్ని గ్రామాల్లో పూర్తిస్థాయి గ్రామ సభలు నిర్వహించకుండా రోడ్డుకు సమీపంలోని భూములకు చెందిన రైతులతో మాట్లాడి సరిపెట్టేశారన్న విమర్శలు వస్తున్నాయి. శొంఠ్యాంలో ఎటువంటి సభలు నిర్వహించలేదని స్థానిక ప్రజాప్రతినిధి ఒకరు వివరించారు. కొందరు రైతుల వద్దకే అధికారులు వెళ్లి మాట్లాడి ఆరా తీసినట్లు తెలిసింది.

✦ పెందుర్తి మండలంలో ఫ్రీహోల్డ్‌కు గుర్తించిన విస్తీర్ణం 20 ఎకరాలే అయినా.. ఈ ప్రక్రియలో నేతల ఒత్తిళ్లు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. భూముల గుర్తింపులో అక్రమాలు జరిగాయనే చర్చ సాగుతోంది.

✦ భీమిలి, పద్మనాభం మండలాల్లో నాడు కొందరు వైకాపా నేతలు ఫ్రీహోల్డ్ కోసం తెరవెనుక చక్రం తిప్పిన భూములపై ఆరా తీస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

మెదడు పోటుకు సూది మందు వైద్యం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మెదడు పోటుకు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయని ప్రముఖ న్యూరోఫిజీషియన్లు వెల్లడించారు. జాతీయ సదస్సు నిర్వహణకు ముందస్తుగా బుధవారం మధ్యాహ్నం ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరో ఫిజీషియన్స్ (ఐఏఎన్) ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని ఒక ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన కార్యశాలను ఆంధ్ర కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఎస్.గోపి, విశ్రాంత ప్రొఫెసరు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఐఏఎన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ దేబాశిష్ చౌధరి, డాక్టర్ మీనాక్షి సుందరం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇస్కీమిక్ స్ట్రోక్ వచ్చిన నాలుగైదు గంటల వ్యవధిలో బాధితుడిని ఆసుపత్రికి తీసుకొచ్చి థ్రాంబోలిసిస్ అనే సూది మందు ఇస్తే మరణం, వైకల్యం నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రస్తుతం ఈ వైద్యం అందుబాటులో ఉందన్నారు. మెదడు పోటు వచ్చి మెడ, మెదడులో మూసుకుపోయిన నాళాల నుంచి గడ్డలను తొలగించడానికి అత్యాధునిక వైద్య పరికరాలను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విధానం ప్రస్తుతం ప్రాచుర్యం పొందిందని పేర్కొన్నారు. కోశాధికారి డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు, చిత్రంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎస్.గోపి, డాక్టర్ మీనాక్షిసుందరం, డాక్టర్ దేబాశిష్ చౌధరి, డాక్టర్ సుష్మ



జాతీయ రహదారి పక్కన పోర్టు ఆసుపత్రి వద్ద జీవీఎంసీ ఆధ్వర్యంలో భారీగా ఖర్చు చేసి 'బస్ బే' నిర్మించారు. కొన్ని నెలలకే అది అధ్వానంగా మారింది. దీనికి అమర్చిన దీపాలు, ఇతరత్రా సామగ్రిని కొందరు ధ్వంసం చేశారు. కొన్ని అపహరించారు. ప్రస్తుతం రూపురేఖలే మారిపోయాయి...ప్రజాధనం మాత్రం వృథా అయిపోయింది. -ఈనాడు, విశాఖపట్నం

నిలిచిన మురుగు.. పర్యాటకులు పరుగు!!



విశాఖపట్నం ఆర్కేబీచ్ తీరంలో ఇసుక తిన్నెల్లో మురుగు నిలిచిపోతుండటంతో పర్యాటకులు ముక్కుమూసుకోవాల్సి వస్తోంది. గెడ్డల్లోనుంచి వచ్చిన మురుగు ఫ్లోటింగ్ బ్రిడ్జి సామగ్రి ఉన్న చోట, కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం సమీపంలో ముందుకు కదలక నిలిచిపోతోంది. ఈ ప్రాంతాలకు వచ్చే సందర్శకులు ఇదేం దారుణం, అధికారులు కనీసం పట్టించుకోరా అని అక్కడి నుంచి వడివడిగా ముందుకు వెళ్లిపోతున్నారు. -ఈనాడు, విశాఖపట్నం.

ఎంపిక పోటీల వేదిక మార్పు

అగనంపూడి, న్యూస్‌టుడే : ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక పోటీలు గురువారం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14 బాల, బాలికల విభాగంలో పోటీల నిర్వహణకు ముందుగా అచ్యుతాపురం పాఠశాలను ఎంపిక చేశామని, వర్షాల కారణంగా లంకెలపాలెం పాఠశాలకు మార్చామని తెలిపారు. ఈ మార్పును వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు గమనించి పోటీలకు హాజరుకావాలని కోరారు.

పరీక్షా కేంద్రం.. ఇక కట్టుదిట్టం..

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో అడుగడుగునా సీసీ కెమేరాలు అమర్చారు. గతంలో మాదిరిగా నేరుగా ఈ విభాగంలోకి ఎవరు వెళ్లాలన్నా ఇప్పుడు కుదరదు. ప్రధాన దారి వద్దే రిసెప్షన్ ఏర్పాటు చేసి వచ్చీ పోయేవారి సంతకాలు తీసుకుంటున్నారు. ఏ సమయంలో వస్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? ఎంతసేపు అక్కడ ఉంటున్నారు? తదితర వివరాలు అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు ఈ విభాగంలో ప్రతీ అంగుళం కనిపించే విధంగా 30కి పైగా ఆధునిక సీసీ కెమేరాలు అమర్చారు. అక్కడి సంభాషణలు కూడా వినిపిస్తాయి. వీటిని పరీక్షల విభాగం డీన్ ఆచార్య కేశవరావుతో పాటు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు తమ చరవాణీల నుంచే పర్యవేక్షిస్తారు. గతంలో మాదిరిగా ఉద్యోగులు తమకు నచ్చిన సమయానికి రావడం, మధ్యలో సొంతపనులపై బయటకు వెళ్లడం కుదరదని చెబుతున్నారు. వీటితో పాటు ఇందులో పనిచేసే వారికి ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నేషన్) పరికరాలు కూడా అధికారులు అమర్చనున్నారు. ఈ విభాగంపై పలు ఫిర్యాదులు వీసీ దృష్టికి వెళ్లడంతో ఈ నిఘాను ఏర్పాటు చేశారు.


పరీక్షల విభాగంలో సీసీ కెమేరా

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

ఇళ్ల నిర్మాణాల స్థితిగతులపై కలెక్టర్ ఆరా..

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణ పనులు నిర్ణీత కాలంలోగా పూర్తి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గృహనిర్మాణ శాఖ అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా సబ్బవరం మండలంలోని గొల్లలపాలెం-2 లేఅవుట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి వాటి స్థితిగతులపై ఆరా తీశారు. రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, నివేదికలు ఎప్పటికప్పుడు పంపించాలని సూచించారు. గృహనిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.


గొల్లలపాలెం లేఅవుట్ మ్యాప్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పెందుర్తి

ఏడేళ్ల తర్వాత నర్సుల సంఘానికి ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలకు సంబంధించి బుధవారం నామపత్రాలు దాఖలయ్యాయి. రెండు ప్యానళ్లకు చెందిన 19 మంది నామపత్రాలు అందజేశారని ఎన్నికల అధికారి, సహకారశాఖ సహాయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యదర్శి పోస్టుకు ముగ్గురు, అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి, కార్యవర్గ సభ్యుల పదవులకు ఇద్దరు చొప్పున నామపత్రాలు అందజేశారు. వాటిని ఈనెల 17న పరిశీలించనున్నారు. 18వ తేదీ సాయంత్రం వరకు ఉపసంహరణకు గడువు ఉంది. ఈనెల 23న ఎన్నిక నిర్వహించనున్నారు. టి.గంగాభవాని అధ్యక్షురాలిగా ఒక ప్యానల్, వి.ఉషారాణి అధ్యక్షురాలిగా ఒక ప్యానల్ నామపత్రాలు దాఖలు చేశారు. దాదాపు 7ఏళ్ల విరామం తర్వాత నర్సుల సంఘానికి ఎన్నికలు జరుగుతుండడంతో కేజీహెచ్‌లో కోలాహలం నెలకొంది.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి: 90598 98721 వేపగుంట: 93472 79909

సబ్బవరం, న్యూస్‌టుడే

సమస్య: సాయినగర్‌కాలనీ సుజుకి షోరూం ఎదుట సుమారు నెల రోజులుగా వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంది. – వి.వెంకటరమణ, సబ్బవరం

సమాధానం: క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

బీఆర్టీఎస్‌లో అడుగుకో గండం..!

- రాత్రుళ్లు కనిపించని వేగనిరోధకాలు
- అదుపుతప్పి గాయపడుతున్న వాహనచోదకులు



నాయుడుతోట వద్ద రేడియం స్టిక్కర్లు లేని వేగనిరోధకం

వేపగుంట, న్యూస్‌టుడే

బీఆర్టీఎస్ రహదారిలో అడుగుకో గండం దర్శనమిస్తోంది. గతంలో మధ్యమార్గంలో ప్రమాదాలు జరిగి పలువురు పాదచారులు మృతి చెందడంతో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల సర్వీస్ రహదార్లలోనూ వీటిని ఏర్పాటు చేశారు. ఇది మంచిదే అయినా రాత్రుళ్లు అవి స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు అమర్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాళ్లు, చేతులు విరిగి పలువురు ఆసుపత్రులపాలైన సందర్భాలు ఉన్నాయి.

ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు

■ ఎస్‌ఆర్ పురానికి చెందిన శ్రీరంగం సాయినాథ్ (24) స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. రెండురోజుల కిందట ద్విచక్ర వాహనంపై విధులకు బయలుదేరారు. బాలాజీగార్డెన్-ఆర్‌ఆర్ వెంకటాపురం మార్గంలో బీఆర్టీఎస్ రహదారి దాటి నరవ మీదుగా స్టీల్‌ప్లాంట్‌కు వెళుతున్నారు. ఆర్‌ఆర్ వెంకటాపురం వద్ద వేగనిరోధకం కనిపించకపోవడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. చేయి విరిగిపోయి ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది.

■ వేపగుంట బీసీకాలనీకి చెందిన కె.శివ ఆటో నడుపుతుంటాడు. సర్వీసు రహదారిపై వేగనిరోధకం వేసినట్టు గుర్తించకపోవడంతో వేపగుంట వినాయకుని ఆలయం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆ సమయంలో ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. శివకు మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని శివ వాపోతున్నాడు. ఇలా వేగనిరోధకాల వద్ద తరచూ ద్విచక్రవాహనదారులు పడిపోయి గాయపడుతున్నారని బీఆర్టీఎస్ రహదారి పక్కనున్న దుకాణదారులు చెబుతున్నారు.

ఈ ప్రాంతాల్లో ప్రమాదకరం

- వేపగుంట కూడలి
- నాయుడుతోట
- ఆర్‌ఆర్ వెంకటాపురం
- ప్రహ్లాదపురం
- పాతగోశాల కూడలి
- చినముషిడివాడ కూడలి
- పెందుర్తి ఆంజనేయస్వామి గుడివద్ద..



వేపగుంట జోనల్ కార్యాలయం వద్ద..

ప్రమాణాలు పాటించరా..

బీఆర్టీఎస్‌లో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఇక్కడ అడుగుకో వేగనిరోధకం ఉండడం సమస్యగా మారింది. ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన ఇవి ప్రమాదాలకు కారణమవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక ప్రాంతంలో వేగనిరోధకం ఏర్పాటు చేయాలంటే తగిన ప్రమాణాలు పాటించాలి. వాహనచోదకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వాటి ఎత్తు ఉండాలి. అలాగే రేడియం స్టిక్కర్లు అమర్చాలి. కాని బీఆర్టీఎస్ సర్వీస్ రోడ్డులో ఎక్కడా ఈ ప్రమాణాలు పాటించనట్లు కనిపించడం లేదు. శిరస్త్రాణం(హెల్మెట్) ధరించ లేదని కేసులు నమోదు చేసే ట్రాఫిక్ పోలీసులు వేగనిరోధకాల విషయంలో ప్రమాణాలు పాటించకపోవడంపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు స్పందించి రాత్రుళ్లు వేగనిరోధకాలు స్పష్టంగా కనిపించేలా తెల్లరంగు లేదా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కోటపాడు-పినగాడి మార్గంలో నిత్యం అవస్థలే..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి.



మొగలిపురం బండమ్మ గుడి సమీపంలో..

ముఖ్యంగా పినగాడి నుంచి కె.కోటపాడు వెళ్లే మార్గంలో సుమారు 30గ్రామాల ప్రజలతో పాటు వందలాది ఆటోలు, 50కిపైగా బస్సులు నిత్యం రాకపోకలు చేస్తుంటాయి. ఈ మార్గం ఆధారంగా నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు వెళ్లి వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యమున్న ఈ రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడడంతో వాహనాల చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ఈ గుంతల్లో పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మిక సదస్సు విజయవంతానికి పిలుపు



సదస్సు ప్రచార గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 18న విజయవాడలో తలపెట్టిన రాష్ట్ర కార్మిక సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షుడు కె.మల్లయ్య పిలుపునిచ్చారు. సదస్సుకు సంబంధించిన ప్రచార గోడపత్రికను బుధవారం చినముషిడివాడ దరి అంబేడ్కర్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఇబ్బందికరంగా మారిన నాలుగు లేబర్ చట్టాలు, మూడు నేర చట్టాలను రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, సభ్యులు సీహెచ్.వెంకటరావు, చిన్నారి, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్డు సభ్యులు, ఉపసర్పంచుల శిక్షణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో రెండు రోజుల గ్రామ వార్డు సభ్యులు, ఉపసర్పంచుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఎంపీడీవో పి.పద్మజ మాట్లాడుతూ 24 పంచాయతీల్లో ఇద్దరేసి వార్డు సభ్యులు, ఉపసర్పంచులకు రెండు రోజుల శిక్షణ విజయవంతంగా నిర్వహించామన్నారు. పంచాయతీల్లోని వీధిలైట్లు, పారిశుద్ధ్యం, తదితర అన్ని విషయాలపైనా అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీల్లో మంచినీటి యాజమాన్య పద్ధతులు నీటిని శుభ్రపరిచే విధానంపై వివరించారు. ఈవోపీఆర్‌డీ చైతన్య చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వేపగుంట, న్యూస్‌టుడే: 11కేవీ ఎల్‌బీనగర్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పురుషోత్తపురం, గోకుల్‌ధామ్ కాలనీ, పురుషోత్తపురం కాలనీ, ఎన్‌ఏడీ లేఅవుట్, ఎల్‌బీనగర్, శానాతివానిపాలెం ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు.

అవీ ఇవీ

■ **నేటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు**

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు(గ్రామ సభలు) నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. ఈనెల 17వ తేదీన తానాం, 19 కలపాక, 22 పరవాడ, 24 కన్నూరు, 26 పెంటసీమభోనంగి, పాయకరావు భోనంగి, 29 భరణికం, నవంబరు 1వ తేదీన ఈదులపాక భోనంగి, 2 ఈ.మర్రిపాలెం, 5వ తేదీన పెదముషిడివాడ గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. ఇవి ఆయా గ్రామాల్లోని సచివాలయాలు, సామాజిక భవనాల వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. రెవెన్యూ శాఖ పరంగా ఎలాంటి సమస్యలున్నా ఈ సభల్లో వినతులు ఇవ్వొచ్చున్నారు. రీసర్వే భూముల కొలతలు, హద్దుల్లో తేడాలున్నా పేర్లు తప్పుగా పడినా అర్జీలు పెట్టుకోవాలన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

రేపు సబ్బవరం మండలంలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: ఈ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సబ్బవరం మండలంలో వివిధ కార్యక్రమాలు జరగనున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 8-30 గంటల నుంచి వరుసగా తవ్వవానిపాలెం, అమృతపురం, పెదగొల్లలపాలెం, బాటజంగాలపాలెం, అసకపల్లి, సబ్బవరం-1, 2, 4 సచివాలయాలు, ఎల్లుప్పి, బోదువలస, గుల్లేపల్లి, మొగలిపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగుతాయని ఆ వర్గాలు వెల్లడించాయి.

■ **4 కిలోల గంజాయి స్వాధీనం**

పెందుర్తి, న్యూస్‌టుడే: అరకు నుంచి నగరానికి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పెందుర్తి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి మండలం సరిపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ కారులో గంజాయిని గుర్తించారు. నిందితులు ఒడిశా రాష్ట్రం కొరాపుట్ ప్రాంతానికి చెందిన రాంబాబు అలగు (32), కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఇమ్మాన్యుయేల్ దాకవరపు (28)ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై గతంలో టూ టౌన్, అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు.

■ **'పంప్‌డ్ స్టోరేజీ'లతో నీటి వనరులు కనుమరుగు**

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తూర్పు కనుమల్లో ఏపీ ప్రభుత్వం మంజూరు చేసిన పంప్‌డ్ స్టోరేజ్ స్కీమ్‌లను రద్దు చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ కోరారు. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుమంత్రిత్వ శాఖ కార్యదర్శి లీనానందన్‌కు బుధవారం లేఖ రాశారు. ఈ ప్రాజెక్టుల వల్ల స్థానికంగా అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులు కనుమరుగవుతాయన్నారు. గత ఏపీ ప్రభుత్వం స్థానిక గిరిజన గ్రామసభలను సంప్రదించకుండా రెండు ముఖ్యమైన కేంద్ర చట్టాలను ఉల్లంఘించిందని ఆయన కేంద్ర కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

జనావాసాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం: ఎమ్మెల్యే



తానాంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, చిత్రంలో కూటమి నాయకులు, అధికారులు

పరవాడ, న్యూస్‌టుడే: జనావాసాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి వాటిని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పరవాడ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పెదముషిడివాడ, కన్నూరు, తానాం, భరణికం, పరవాడ, వెన్నెలపాలెం, గొర్లెవానిపాలెం, పి.భోనంగి గ్రామాల్లో సీసీ రోడ్లు, కాల్వలు తదితర అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జీవీఎంసీ, జడ్పీ తదితర నిధులతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పలుచోట్ల ఎమ్మెల్యేను స్థానికులు ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీపీలు పైలా జగన్నాధరావు, మాసవరపు అప్పలనాయుడు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ అంబేడ్కర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వసతిగృహంలో సదుపాయాలపై ఆరా

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ తనిఖీ చేశారు. వసతి గృహంలో సదుపాయాలపై బాలలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందించే భోజనం, ఆహార పదార్థాలు, నిత్యావసర సరకుల నాణ్యతను పరిశీలించారు. వార్డెన్ సూర్యప్రకాశరావు నుంచి వివరాలు సేకరించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు.



వార్డెన్‌తో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

నేడు దేవీపురంలో దసరా ముగింపు వేడుకలు



శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం దేవీపురంలో ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన దసరా బ్రహ్మోత్సవాలు 17వ తేదీతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా గురువారం శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు కె.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులతో లలితా సహస్రనామావళి పఠనం, ఆ తర్వాత ఉదయం 10 గంటలకు కల్యాణ వేడుకలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన, సాయంత్రం జల హారతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అక్కడ టపాసుల దుకాణాల ఏర్పాటులో తప్పేముంది: హైకోర్టు

ఈనాడు, అమరావతి: విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) మైదానంలో దీపావళికి టపాసులను విక్రయించేందుకు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వకుండా అధికారులను నిలువరించాలంటూ పిటిషనర్ చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. దీపావళి సందర్భంగా మూడు రోజులపాటు జనావాసాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేస్తే తప్పేముందని వ్యాఖ్యానించింది. పిటిషనర్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లో మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు స్పష్టంచేసింది. విచారణను నవంబర్ 1కి వాయిదా వేసింది.

★ ఏయూ పరిధిలోని 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న 1500 చెట్లను కూల్చివేశారని, అందుకు అటవీశాఖ అధికారుల అనుమతి లేదని, వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధంగా కొట్టేశారని, కుంటలు, నీటి ప్రవాహ ప్రాంతాలను(గెడ్డలను) పూడ్చి వేస్తున్నారని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ 2022లో హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో తాజాగా అనుబంధ పిటిషన్ వేస్తూ.. దీపావళికి టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఏయూ మైదానంలో భూమిని చదును చేస్తున్నారన్నారు. మైదానానికి సమీపంలో విద్యార్థుల వసతిగృహం ఉందన్నారు. ఏయూ, జిల్లా కలెక్టర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 15 ఏళ్లుగా ఆ మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. జనావాసాలకు దూరంగా అదే సురక్షిత ప్రాంతమన్నారు. కేవలం మూడు రోజులు మాత్రమే దుకాణాలకు అనుమతిస్తున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం దుకాణాల ఏర్పాటును నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. అనుబంధ పిటిషన్ నిరర్థకం అయ్యేందుకు ఉద్దేశపూర్వకంగానే విచారణను నవంబర్ 1కి వాయిదా వేస్తున్నట్లు వ్యాఖ్యానించింది.

630 కిలోల రేషను బియ్యం పట్టివేత

పెందుర్తి, న్యూస్‌టుడే: అనధికారికంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. చినముషిడివాడ ప్రాంతంలోని ఓ నివాసంలో పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం ఆధారంగా డీసీఎస్‌ఓ వి.భాస్కర్‌రావు, సిబ్బంది బుధవారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో 630 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అనధికారికంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని డీసీఎస్‌ఓ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.



పట్టుబడ్డ రేషను బియ్యంతో డీసీఎస్‌ఓ భాస్కర్‌రావు



నిరసన తెలుపుతున్న సిటూ నాయకులు, కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే: దువ్వాడ వీసెజ్‌లోని సినర్జీస్ కాస్టింగ్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ఆరు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని సిటూ నాయకుడు ఎం.రాంబాబు ఆరోపించారు. వేతనాలపై ప్రశ్నించిన కార్మికుల్ని విధుల నుంచి తొలగిస్తామని యాజమాన్యం బెదిరిస్తోందన్నారు. బుధవారం సంస్థ గేటు వద్ద సిటూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలో పని చేస్తున్న సుమారు 950 మంది కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మధ్యాహ్నం బి-షిఫ్ట్‌కు వచ్చిన కార్మికులు పరిశ్రమ గేటు వద్ద ఆందోళనకు దిగడంతో ఏ-షిఫ్ట్‌కు వచ్చిన వారంతా సంస్థ లోపలే ఉండిపోయారు. రాత్రి పది గంటల వరకు ఆందోళన కొనసాగింది. యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోతే రాత్రంతా ధర్నా కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. సిటూ నాయకులు దత్తాత్రేయ, నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై చురుగ్గా దర్యాప్తు



దాడి ప్రసాదరావు (పాతచిత్రం)

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి రాతిచెరువు దరి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చెందిన దాడి ప్రసాదరావు (54) అదృశ్యంపై పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేస్తున్నారు. ప్రసాదరావు ఛత్తీస్‌గఢ్‌లోని ఉక్కు పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 9న సెలవుపై పెందుర్తికి వచ్చారు. 12న మధ్యాహ్నం సినిమా చూడడానికి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. చరవాణి కూడా పని చేయకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆ మేరకు ప్రసాదరావు భార్య హేమలత పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు బాధ్యతలు ఏఎస్ఐ డీఎస్ఎన్ రాజుకు అప్పగించారు. ప్రసాదరావు ఆచూకీ కోసం చురుగ్గా దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ రాజు తెలిపారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఎంఈవో దివాకర్‌రావు తదితరులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అభ్యసన వైకల్య మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి దివాకర్‌రావు మాట్లాడుతూ నిర్దిష్ట అభ్యసన వైకల్యాలున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అన్నిరకాల సేవలు, సదుపాయాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్యేక శిక్షణ వల్ల వారిలో ఉన్న అభ్యసన సమస్యలు అధిగమించవచ్చునన్నారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సిబ్బంది కుమారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

సింధియా: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలు... బిహార్‌లోని పాట్నాకు చెందిన విక్కీకుమార్ విశాఖపట్నం నౌకాదళంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఝార్ఖండ్‌కు చెందిన కుసుమకుమారి(28)తో 2020లో వివాహమైంది. వారు స్థానిక బర్మాకాలనీలో నివాసం ఉంటున్నారు. ఉదయం విక్కీకుమార్ విధులకు వెళ్లగా, 10.30 గంటల సమయంలో కుసుమకుమారి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు, నేవీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్ పర్యవేక్షణలో సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

యూజీడీ మురుగు రోడ్డుపైకి..



నాగమల్లినగర్ దరి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఇలా..

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే

జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ కాలనీ డీఏవీ పాఠశాల వెనుక ప్రాంతంలో మురుగు నిలిచిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ నాగమల్లినగర్ దరి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద యూజీడీ (భూగర్భ మురుగు నీటి వ్యవస్థ) మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగి పొర్లుతోంది. గత కొన్నాళ్లుగా రోడ్డుపైకి మురుగు ప్రవహించి నిలిచిపోయింది. మట్టి రోడ్డు కావడంతో బురదగా మారి ద్విచక్ర వాహనాలు జారిపోతున్నాయని, పాదచారులు పడిపోతున్నారని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని కోరారు.

రహదారి కుంగిపోతోంది..




జీవీఎంసీ 93వ వార్డు దుర్గానగర్‌కాలనీకి వెళ్లే రహదారిపై గొయ్యి ఏర్పడి ప్రమాదభరితంగా మారింది. రాత్రివేళల్లో కనిపించకపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి పడిపోతున్నారు. గొయ్యి కింది భాగాన కాలువ ఉండటంతో రోజురోజుకు రోడ్డు కుంగిపోతోంది. పెద్ద ప్రమాదం జరగక ముందే జీవీఎంసీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– వేపగుంట, న్యూస్‌టుడే

కాలువలో పిచ్చిమొక్కలు.. కదలని మురుగు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే

జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సత్యానగర్ దరి నాగేంద్రకాలనీలోని కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి మురుగు నిలిచిపోయింది. చాన్నాళ్లుగా కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఇరువైపులా పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోయి మురుగు కదలని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. దుర్వాసన, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయించాలని కోరారు.



నాగేంద్రకాలనీలో కాలువలో పిచ్చి మొక్కలు

మనకంటూ ఓ బ్రాండ్


- ఆ దిశగా డ్వాక్రా సంఘాలు కృషి
- ఆన్‌లైన్ విక్రయాలకు శ్రీకారం

స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ జీవనోపాధి కోసం తయారుచేసి విక్రయించే పలు ఉత్పత్తులు అంతర్జాల వేదికగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్ విధానంలో వారు తయారు చేసే వస్తువులు ప్రపంచానికి పరిచయం చేయటం ద్వారా వారి ఉత్పత్తులకు బ్రాండ్‌ను సృష్టించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో మెప్మా సహకారంతో చర్యలు చేపట్టారు. మైస్టోర్ వేదికగా 118 ఉత్పత్తుల విక్రయాలకు ఉంచారు.

– న్యూస్‌టుడే, ఉషోదయకూడలి(ఎంవీపీకాలనీ)



వస్తువులను తయారు చేస్తున్న డ్వాక్రా మహిళలు



ఆన్‌లైన్ మైస్టోర్‌లో ఉంచిన ఉత్పత్తుల వివరాలు

86 మంది రిజిస్ట్రేషన్...

స్వయం సహాయ సంఘాల సభ్యులు తయారు చేసే పలు ఉత్పత్తుల విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మెప్మా బజారు, సరస్ పేరిట మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని మెప్మా ఈ అవకాశాన్ని కూడా వినియోగించుకుంటోంది.

★ జీవీఎంసీ పరిధిలో యూసీడీ విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను పరిశీలించే అధికారి ప్రతీనెలా జరిగే మహిళా సంఘాల సమావేశాలకు వెళ్లి వారు తయారుచేసే ఉత్పత్తుల గురించి తెలుసుకుని వాటిలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు అవకాశాలు ఉండే వాటిని ఎంపిక చేస్తున్నారు. ఇప్పటి వరకు 86 మంది తమ ఉత్పత్తులను రిజిస్ట్రేషన్ చేశారు.

★ ఆయా ఉత్పత్తులను ఒక చోట చేర్చి ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు అవసరమైన రీతిలో వాటికి ఫొటోలు తీసి జాబితాను సిద్ధం చేశారు. ఇలా 118 రకాల ఉత్పత్తులను అంతర్జాల వేదికగా మార్కెటింగ్ కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. మైస్టోర్‌లో ఈ ఉత్పత్తులను మార్కెటింగ్ కల్పిస్తున్నారు. ఓఎన్‌డీసీకి అనుసంధానమైన అమెజాన్, షాపై, పేటీఎం ఇలా పలురకాల యాప్‌లలో కూడా ఇవి దర్శనమిస్తాయి.



ఆన్‌లైన్‌లో ఉంచిన వివిధ రకాల ఉత్పత్తులు

★ ఇప్పటి వరకు 60 ఉత్పత్తులకు ఆర్డర్లు సైతం రాగా వాటిని జాగ్రత్తగా ప్యాకింగ్ చేసి కొనుగోలు చేసిన వారికి పంపిస్తున్నారు. ఇప్పటి వరకు రూ.15వేల వ్యాపారం జరిగిందని అధికారులు తెలిపారు.



★ ప్రధానంగా ఏటికొప్పాక బొమ్మలు, వుడ్ కార్వింగ్ క్రాఫ్ట్ (చెక్కతో చేసిన ఉత్పత్తులు), పొటరీ (మట్టితో చేసిన ఉత్పత్తులు), సముద్రపు గవ్వలతో చేసిన వివిధ రకాల ఉత్పత్తులు, జ్యూట్ బ్యాగులు, వస్త్రంతో చేసిన బ్యాగులు ఆన్‌లైన్‌లో ఉంచారు.



చూసేదెలా... ముందుకు వెళ్లేదెలా!!



వీఐపీ రోడ్డు కూడలి వద్ద కనిపించని రీతిలో...



మద్దిలపాలెం కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అడ్డుగా స్తంభం

నగరంలోని కొన్ని కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ వాహనదారులకు పరీక్ష పెడుతున్నాయి. పేరుకు మాత్రమే ఇవి ఉన్నాయి. కొన్ని చోట్ల అడ్డుగా కొమ్మలు, స్తంభాలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మరి కొన్ని చోట్ల సిగ్నల్స్ కనిపించని రీతిలో అటూ.. ఇటూ వంగిపోయి ఉన్నాయి. ప్రమాదాలు జరగకుండా నిత్యం లైసెన్స్‌లు తనిఖీలు చేస్తున్న పోలీసులు... వీటిని కూడా పట్టించుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు. –ఈనాడు, విశాఖపట్నం



ద్వారకానగర్ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అడ్డుగా చెట్టుకొమ్మలు

షిప్‌యార్డుకు అత్యాధునిక టగ్ నిర్మాణ బాధ్యతలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ పోర్టు అవసరాల కోసం 60 టన్నుల సామర్థ్యం గల బొలార్డ్‌పుల్ టగ్‌ను నిర్మించే బాధ్యతను హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)కు అప్పగించారు. ఈ మేరకు పోర్టు, హెచ్‌ఎస్‌ఎల్ అధికారుల మధ్య బుధవారం పోర్టు ఏటీబీలో అవగాహన ఒప్పందం కుదిరింది. పోర్టు తరపున డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ టి.శ్రీనివాస్, షిప్‌యార్డు తరపున డైరెక్టర్ కమాండర్ గిరిదీప్‌సింగ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఒప్పంద తేదీ నుంచి 18 నెలల సమయంలో టగ్ నిర్మాణం పూర్తి చేసి పోర్టుకు అప్పగించాల్సి ఉంటుంది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన భద్రతా ప్రమాణాలను అనుసరించి ఈ టగ్ రూపొందించనున్నారు. హార్బర్‌లో నౌకల నిరంతరాయ కదలికలను సులభతరం చేయడంలో ఇది కీలకపాత్ర పోషించనున్నది. రాబోయే రోజుల్లో కార్గో సామర్థ్యాన్ని పెంచడంతో ఈ టగ్ ఇతోధికంగా సహాయపడుతుందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న పోర్టు డిప్యూటీ కన్జర్వేటర్ కెప్టెన్ టి.శ్రీనివాస్, షిప్‌యార్డు డైరెక్టర్ కమాండర్ గిరిదీప్ సింగ్, ఇతర అధికారులు

పలు రైళ్ల రీషెడ్యూల్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: లింక్ రైళ్ల ఆలస్యంగా నడుస్తుండడంతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. హావ్‌డా-ఎస్ఎంవీటీ బెంగళూరు (12863) ఎక్స్‌ప్రెస్ ఈనెల 16వ తేదీ రాత్రి 10.50గంటలకు బదులు 2.40 గంటలు ఆలస్యంగా అర్ధ రాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు.. సంత్రాగచ్చి-సికింద్రాబాద్ (07222) ప్రత్యేక రైలు ఈనెల 16న మధ్యాహ్నం 12.20 గంటలకు బదులు 10.40 గంటలు ఆలస్యంగా రాత్రి 11 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారు.

సింహాద్రి తొలి యూనిట్‌లో సాంకేతిక లోపం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ తొలి యూనిట్‌లో బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లోని బాయిలర్ ట్యూబులకు లీకేజీలు ఏర్పడడంతో సంస్థ అధికారులు ఉత్పత్తిని నిలుపుదల చేశారు. బాయిలర్ ట్యూబు లీకేజీలకు మరమ్మతులు పూర్తయిన వెంటనే యూనిట్‌లో విద్యుదుత్పత్తిని పునఃప్రారంభిస్తామని సంస్థ అధికారులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నాటికి మరమ్మతులు పూర్తయ్యే అవకాశం ఉందని, 2, 3, 4 యూనిట్‌లలో విద్యుదుత్పత్తి యథావిధిగా కొనసాగుతోందని వారు వెల్లడించారు.

ఇంటర్ విద్యార్థి మృతితో విషాదం

అగనంపూడి, న్యూస్‌టుడే : దసరా సెలవులకు బంధువుల ఇంటికి వెళ్లిన ఇంటర్ విద్యార్థి మృతి చెందడంతో అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ వివరాలు... స్థానిక కాలనీలో నివాసం ఉంటున్న కె.నరసింహమూర్తి రెండో కుమారుడు సాత్విక్ (18) గాజువాకలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సెలవులకు తన సోదరితో కలిసి ఒడిశా సుందర్‌ఘడ్ జిల్లా దార్లపాలిలో ఉంటున్న మేనమామ ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి 13న బంధువులతో కలిసి కనకుంద విహారయాత్రకు వెళ్లారు. నదిలో స్నానం చేస్తుండగా సాత్విక్ గల్లంతయ్యాడు. నాటి నుంచి తలసారా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా.. మంగళవారం సాయంత్రం సాత్విక్ మృతదేహం లభ్యమైంది. బుధవారం ఉదయం మృతదేహాన్ని అగనంపూడి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

తండ్రి హత్య కేసులో కుమారుడి అరెస్టు

పెందుర్తి, న్యూస్‌టుడే: తండ్రిని హత్య చేసి పరారీలో ఉన్న కొడుకును బుధవారం అరెస్టు చేసినట్లు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. నరవ దరి మన్నేపాలెంలో మంగళవారం తండ్రి యుంగాలి దేముడును కొడుకు యుంగాలి గోపి (26) హత్య చేసి పరారయ్యాడు. ఆ మేరకు పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్ నేతృత్వంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం పెందుర్తి రైల్వేస్టేషన్ సమీపంలో సంచరిస్తున్న నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రెవెన్యూలో కొలిక్కిరాని బదిలీలు

తహసీల్దార్ పోస్టు ఇవ్వలేదని కోర్టులో కేసు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల బదిలీలు ఇంకా కొలిక్కి రాలేదు. బదిలీల ప్రక్రియ ముగిసి 25రోజులైనా ఇంకా విశాఖ జిల్లాలోని ముగ్గురు తహసీల్దార్లు తమకు కేటాయించిన పోస్టుల్లో చేరలేదు. ఫలితంగా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల నుంచి తహసీల్దార్లు విశాఖకు రాలేని పరిస్థితి. తనను మండల తహసీల్దార్‌గా నియమించలేదని ఏకంగా ఓ తహసీల్దార్ కోర్టును ఆశ్రయించారు. ఆయన్ను విశాఖ కలెక్టరేట్‌లో ఓ విభాగ పర్యవేక్షకుడిగా నియమించారు. ఆ నియామక ఉత్తర్వులను కోర్టులో సవాలు చేశారు. కోర్టు తీర్పు వచ్చినప్పటికీ ఉత్తర్వుల కాపీలు అధికారికంగా రాకపోవడంతో సంబంధిత తహసీల్దార్ విషయంలో అధికారులు తదుపరి చర్యలు తీసుకోలేకపోతున్నారు.

★ హైకోర్టును ఆశ్రయించిన తహసీల్దార్‌ను ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించారు. ఆయన వెళితే కాని అక్కడి నుంచి జిల్లాకు మరో తహసీల్దార్ రాలేని పరిస్థితి నెలకొంది. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఓ తహసీల్దార్ విశాఖ రాలేదు. దీంతో ఇక్కడి నుంచి మరొకరు అక్కడికి వెళ్లలేని పరిస్థితి ఉంది. ఫలితంగా జిల్లాలో మహారాణిపేట తహసీల్దార్ పోస్టుతో పాటు కలెక్టరేట్‌లో రెండు విభాగాల పర్యవేక్షక పోస్టులు ఇంకా భర్తీ కాలేదు. సంబంధిత అంశాలపై దృష్టి సారించామని, రెండు మూడు రోజుల్లో ఇవన్నీ కొలిక్కి వస్తాయని జిల్లా అధికారి ఒకరు తెలిపారు.

★ పెందుర్తి మండల సర్వేయర్‌గా నియమితులైన అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన సర్వేయర్‌ను విధుల్లో చేర్చుకోలేదు. ఆయనపై ఆరోపణలున్న నేపథ్యంలో వెనక్కి పంపారు. ఆ స్థానంలో మరొకర్ని సర్వేయర్‌గా నియమించాల్సి ఉంది.

ఈ పంచ్‌కు పదునెక్కువ...!

న్యూస్‌టుడే, విశాఖ క్రీడలు



పంచ్ విసురుతున్న శ్యామ్‌కుమార్

సరదాగా బాక్సింగ్ రింగ్‌లోకి దిగితే.. అదే అతని జీవితాన్ని మలుపు తప్పింది. రింగ్‌లో ఉన్నతంగా ఎదిగాడు. బరిలోకి దిగితే ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టి పతకం సాధిస్తాడని గుర్తింపు తెచ్చుకున్నాడు. తండ్రి బాటలో నడుస్తూ.. ఆయన పేరును నిలబెడుతూ శభాష్ అనిపించుకుంటున్నాడు. అతనే కంచరపాలెంకు చెందిన అంతర్జాతీయ బాక్సర్ కె.శ్యామ్‌కుమార్.

ఇటీవల రైల్వే శ్రీనివాస కల్యాణ మండపంలో ముగిసిన అఖిల భారత అంతర రైల్వే బాక్సింగ్ పోటీల్లో రజత పతకం కైవసం చేసుకున్నాడు. వచ్చే ఒలింపిక్స్‌లో పాల్గొని పతకం కొల్లగొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

బాక్సింగ్‌లో శ్యామ్‌కుమార్ మెరుపులు

శ్యామ్‌కుమార్ తండ్రి అర్జున్. స్వతహాగా బాక్సింగ్ క్రీడాకారుడు. శ్యామ్‌కుమార్ ఏడాది పాటు తండ్రి వద్ద బాక్సింగ్‌లో ఓనామాలు నేర్చుకున్నాడు. సోదరుడు సాగర్ కూడా బాక్సర్ కావడంతో అన్నదమ్ములిద్దరూ పోటీపడి సాధన చేసేవారు. అలా 2006లో శ్యామ్‌కుమార్ బాక్సింగ్‌లో ప్రవేశించాడు. అనంతరం ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు వద్ద శిక్షణ పొందాడు. అక్కడి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు గెలుపొందే స్థాయికి చేరుకున్నాడు. అనారోగ్యంతో తండ్రి 2013లో మృతి చెందారు. తండ్రి కోరిక మేరకు ఒలింపిక్స్‌లో ఆడాలని, పతకం గెలుపొందాలనే పట్టుదలతో శ్యామ్‌కుమార్ ముందుకు సాగుతున్నాడు.

అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు

పాల్గొన్న పోటీలు.. సాధించి పతకాలు

- 2014, 2015, 2016లో కజికిస్థాన్‌లో జరిగిన ప్రపంచ పోటీల్లో కాంస్యం, రెండు స్వర్ణాలు. కేరళలో జరిగిన జాతీయ పోటీల్లో స్వర్ణం.
- 2016, 2017లో అసోం, విశాఖలో జరిగిన సీనియర్ నేషనల్స్‌లో రజత, స్వర్ణ పతకాలు.
- 2014, 2015, 2016, 2017 సంవత్సరాల్లో థాయ్‌లాండ్‌లో జరిగిన కింగ్స్‌కప్ పోటీల్లో 4 స్వర్ణాలు.
- 2017 అజర్‌బైజాన్, జకార్తాలో జరిగిన పోటీల్లో స్వర్ణ పతకాలు.
- 2022 గువాహటి, 2023 దిల్లీలో జరిగిన అఖిల భారత అంతర రైల్వే బాక్సింగ్ పోటీల్లో రెండు కాంస్యాలు.
- 2016 రియో ఒలింపిక్స్ ట్రయల్స్‌లో కాంస్యం.
- 2018లో మంగోలియాలో జరిగిన పోటీల్లో స్వర్ణం.

పదునైన 'పంచ్'లే ఆయుధంగా..

● శ్యామ్‌కుమార్ బాక్సింగ్ రింగ్‌లో దిగాడంటే తొలుత నెమ్మదిగా, ఆచితూచి ఆడుతాడు. ప్రత్యర్థిలోని లోపాలను గుర్తించిన తర్వాత పదునైన పంచులతో విరుచుకుపడి మట్టి కరిపిస్తాడు.

● 2018లో శ్యామ్‌కుమార్ ఇండోనేషియాలో జరిగిన ఏసియన్ గేమ్స్‌లో పాల్గొన్నాడు. అక్కడ ఓ బౌట్‌లో గాయపడ్డాడు. కాలి నరం తెగిపోవడంతో ఏడాది పాటు క్రీడకు విరామం ఇవ్వాల్సి వచ్చింది. కఠోరంగా శ్రమించి మళ్లీ పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించాడు. ఇప్పుడు రింగ్‌లో మరింత దూకుడుగా ఆడుతున్నాడు. శ్యామ్‌కుమార్ ప్రతిభకు కేంద్ర ప్రభుత్వం మెచ్చింది. ఫలితంగా 2016లో క్రీడా కోటాలో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం విశాఖ కమర్షియల్ విభాగంలో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.



డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ నుంచి పతకం అందుకున్న క్షణాన..

'పొట్టేల్' చిత్రం బృందం సందడి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పొట్టేల్ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని ఆ సినిమా హీరోయిన్ అనన్య నాగళ్ల తెలిపారు. పొట్టేల్ చిత్రం ప్రచారంలో భాగంగా ఆ చిత్ర యూనిట్ హైదరాబాద్ నుంచి బస్సు యాత్ర చేసుకొని బుధవారం బీచ్‌రోడ్డుకు వచ్చారు. ఈ సందర్భంగా అనన్య నాగళ్ల మాట్లాడుతూ.. ఈనెల 25న పొట్టేల్ చిత్రం విడుదల అవుతుందన్నారు. తెలంగాణ సామాజిక పద్ధతులు ఇందులో కనిపిస్తాయన్నారు. హీరో యవన్‌కృష్ణ మాట్లాడుతూ.. టీజర్‌కు మంచి స్పందన వచ్చిందని చెప్పారు. నటులు అజయ్ పాత్ర, నోయల్, దర్శకుడు సాహిత్ మొతుకూరి, చిత్ర సహనిర్మాత నిశాంక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హీరోయిన్ అనన్య

అన్నప్రసాద పథకానికి రూ.2లక్షల విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి పాత గాజువాక ప్రాంతానికి చెందిన గణేశ్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత జి.వెంకటనాయుడు బుధవారం రూ.2,08,116 విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై విరాళాల కౌంటర్‌లో ఆలయ ఉద్యోగి సూర్యనారాయణకు అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



ఆలయ ఉద్యోగి సూర్యనారాయణకు చెక్కు అందిస్తున్న దాత వెంకటనాయుడు, కుటుంబ సభ్యులు

ఆగుతూ... కురుస్తూ

వాయుగుండం ప్రభావంతో వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో ముసురు వాతావరణం నెలకొంది. మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో అడపాదడపా వర్షం పడింది. రాత్రి 8 గంటల వరకు అత్యధికంగా ఎంవీపీ కాలనీలో 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. శుక్రవారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని ప్రకటించింది.

బుధవారం ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు వర్షపాతం(మి.మీ.)

ఎంవీపీకాలనీ	40
జోగవానిపాలెం	34
హెచ్‌బీ కాలనీ	34
రైల్వే న్యూకాలనీ	29
ఆరిలోవ	28
మహారాణిపేట	25
గోపాలపట్నం	23
పెదవాల్తేరు	22



ఇసుకతోట ప్రాంతంలో ఓ వీధిలో నిలిచిన వర్షపునీరు



కృష్ణమందిరం సమీపంలో ఓ ఇంటిలోకి చేరిన నీరు

వీధులను వదలని నీరు..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : వాయుగుండం ప్రభావం విశాఖలో బుధవారం ఉదయం కురిసిన వర్షానికి పలు రహదారులు, వీధులు జలమయమయ్యాయి. ఇసుకతోటలో కొన్నిచోట్ల నీళ్లు ఇళ్లలోకి వెళ్లిపోయాయి. కొన్ని చోట్ల ద్విచక్ర వాహనాలు, కార్లు మునిగిపోయాయి. చాలాసేపటి వరకు నీరు నిలిచే ఉంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ఉక్కు పరిరక్షణ బాధ్యత కూటమిదే : పల్లా

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఉక్కు పరిరక్షణ బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందని, కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించేందుకు కృషి చేస్తున్నామని తెదేపా రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆటోనగర్ సమీప గ్రీన్‌సిటీ కల్యాణ మండపంలో గాజువాక నియోజకవర్గం కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో ఇప్పటికే కేంద్రం స్పందించి, ఉక్కు సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపేలా ఆలోచనలు చేస్తుందన్నారు. ఉక్కుపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు నమ్మొద్దన్నారు. ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తామన్నారు. నియోజకవర్గం పరిధిలో చెరువుల్ని అభివృద్ధి చేసి జల సంరక్షణ చర్యలు చేపడతామన్నారు. తెదేపా సమన్వయ కర్త పి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు కోన తాతారావు, జి.అప్పారావు, కె.నర్సింగరావు, అనంతలక్ష్మి మాట్లాడారు. కార్పొరేటర్లు బొండా జగన్, జి.శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్, పి.లక్ష్మి, ముత్యాలనాయుడు, ఇతర నాయకులు వి.రామ్మోహన్‌కుమార్, జి.వెంకునాయుడు, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రైవేటు దుకాణాల్లో మద్యం విక్రయాలు ఆరంభం

మాధవధార, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా మొదటిరోజు దాదాపుగా 50 శాతం వ్యాపారులు నూతన మద్యం దుకాణాలను ప్రారంభించి విక్రయాలను ప్రారంభించినట్లుగా ఎక్సైజ్ డీసీ డి.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. లాటరీ ద్వారా దుకాణాలను దక్కించుకున్నవారికి స్టాక్ అందజేశామన్నారు. నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు నిబంధనల ప్రకారం ఉన్నాయో, లేవో పరిశీలించారు. ప్రస్తుతం డిజిటల్‌పేల ద్వారా కూడా నగదు చెల్లింపులకు అవకాశం కల్పించాలి.

అన్నీ పరిశీలించాకే శాశ్వత లైసెన్సులు: ప్రస్తుతం లాటరీలో జిల్లా వ్యాప్తంగా 155 మద్యం దుకాణాలను దక్కించుకున్న వారందరికీ వారం రోజులు పాటు ప్రొవిజినల్ లైసెన్సులు జారీచేశారు. వారం రోజుల్లోపు నిబంధనలు కచ్చితంగా పాటించి దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాలి. అన్నీ సరిగా ఉంటేనే 22న శాశ్వత లైసెన్సులు జారీ చేస్తామని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు.

అభ్యంతరాలున్న చోట మరోసారి పరిశీలన: గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను జనావాసాలున్నచోట ఏర్పాటు చేశారంటూ స్థానికుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై ప్రజల అభ్యంతరాలేమిటో మరోసారి తెలుసుకొని, ప్రజలకు ఇబ్బందులు ఉంటే అక్కడ దుకాణాల ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నిబంధనలు ఇవీ..: ★ నూతనంగా దుకాణం ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పకుండా ఎక్సైజ్‌శాఖ నిర్దేశించిన నిబంధనలు పాటించాలని అధికారులు చెప్తున్నారు. ఆలయాలు, పాఠశాలల సమీపంలో దుకాణాలను ఏర్పాటు చేయకూడదు. వీటికి కనీసం 100 మీటర్ల దూరంలో ఉండాలి.

★ జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న గ్రామాల్లో 20 వేల మించి జనాభా ఉంటే 500 మీటర్ల దూరంలో దుకాణం ఏర్పాటు చేయాలి.

★ మద్యం దుకాణం వద్ద తాగేందుకు అనుమతి లేదు. ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పీకే విక్రయించాలి. ఒక వ్యక్తికి 3 సీసాలను మాత్రమే అమ్మాలి.

గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించరా..!

జడ్పీ స్థాయీ కమిటీ సమావేశంలో ఛైర్‌పర్సన్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ కమిటీ సమావేశాలు బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగాయి. గ్రామీణాభివృద్ధి, జలవనరులు, గనులు, ప్రజా రవాణా, ప్రజా సంక్షేమ పనులు, రహదారులు, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించలేదని, ఇది వరకు దరఖాస్తులు చేసుకున్న వారికి కొత్తగా గృహాలు మంజూరు కాలేదన్నారు. గ్రామసభల వివరాలను జడ్పీటీసీలకు తెలియజేయాలన్నారు. గ్రామ సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయి కనెక్షన్లపై దృష్టి సారించాలని కోరారు. ★ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ వివిధ రూట్లలో నిలుపుదల చేసిన బస్సులను పునఃప్రారంభించాలని కోరారు. పూర్తి చేసిన పనుల నివేదికతో అధికారులు జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని సూచించారు. జడ్పీ సీఈఓ నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతినెలా 1న 95శాతం వరకు పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని జడ్పీటీసీ సభ్యులను కోరారు. మండల స్థాయి రహదారులను ఉపాధి హామీ పథకం కింద, జడ్పీ రహదారులను జడ్పీ నిధులతో నిర్మిస్తామని చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.245కోట్ల మేర రహదారుల అభివృద్ధికి ఖర్చు చేసినట్లు చెప్పారు. నాలుగో స్థాయీ కమిటీ సమావేశానికి పలువురు జడ్పీటీసీలు గైర్హాజరయ్యారు. కోరం చాలకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర. చిత్రంలో సీఈఓ నారాయణమూర్తి

మేఘం మెరిసే... పుడమి మురిసే

నీలాకాశంలో తెల్లని మబ్బులన్నీ జత కట్టగా.. నేలపై ఉన్న పచ్చందాలన్నీ పరవళ్లు తొక్కాయి. బుధవారం ఉక్కునగరం ప్రధాన పరిపాలన భవనంపై నుంచి చూడగా... ప్రకృతి రమణీయతకు అద్దం పట్టేలా ఉన్న ఈ దృశ్యం కనువిందు చేసింది.

– న్యూస్‌టుడే, ఉక్కునగరం



అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: ఎంపీ శ్రీభరత్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : విశాఖ పార్లమెంట్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ వి.ఎం.ఆర్.డి.ఎ. అధికారులను కోరారు. సిరిపురం వి.ఎం.ఆర్.డి.ఎ సమావేశ మందిరంలో బుధవారం వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్‌తో కలిసి పలు అంశాలపై చర్చించారు. బృహత్తర ప్రణాళిక, రహదారుల ప్రాధాన్యత ఆధారంగా పనులు వేగవంతం చేయాలన్నారు. అంతర్గత రహదారులను ప్రధాన రహదారులకు అనుసంధానం చేయాలన్నారు. జాయింట్ కమిషనర్ కె.రమేష్, ప్రధాన ఇంజినీర్ కె.భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్ బలరామరాజు, అధికారులు పాల్గొన్నారు.



వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ విశ్వనాథన్‌తో చర్చిస్తున్న ఎంపీ శ్రీభరత్

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్ – జనక అయితే గనక
రాములమ్మ– దేవర
తాతా – వేట్టయాన్ ది హంటర్
సప్తగిరి– విశ్వం, చోటుమహరాజ్
(వెల్లంకి) – వేట్టయాన్ ది హంటర్

కార్మికుల బకాయిలు విడుదల చేయాలి

తగరపువలస, న్యూస్‌టుడే: చిట్టివలస జూట్ మిల్లు కార్మికులకు రావాల్సిన బకాయిలను సత్వరమే ఇప్పించాలని కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడు జె.వి.కైలాస్ రెడ్డి కోరారు. రెండేళ్లుగా పి.ఎఫ్. సొమ్ము కార్మికులకు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ విషయంలో చొరవ తీసుకుని పెండింగ్ బకాయిలు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డి.అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలిలా.. రాకపోకలెలా..


చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఎదురుగా సేవా రహదారిపై..

జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలో పలుచోట్ల కాలిబాటలపై సిమెంటు పలకలు విరిగిపోవడంతో పాదచారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా పీఎంపాలెం క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది కూడలి వరకు ఈ పరిస్థితి అధికంగా ఉందని, ఏమాత్రం ఆదమరిచి నడిచినా ప్రమాదానికి గురి కాక తప్పదని పలువురు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, కొమ్మాది

మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పలు ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలకు, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజలు, వృద్ధులు ఇక్కడి కాలిబాటలపై నిత్యం రాకపోకలు చేస్తుంటారు. కొన్నిచోట్ల మూగజీవాలు సైతం వీటిపై నడిచి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ సమస్యపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


ప్రమాద హెచ్చరికగా స్థానికులు పెట్టిన అరటిదుంగ


మధురవాడ ఎస్‌బీఐ ఎదురుగా..

తూతూ మంత్రంగా చర్యలు..

గతంలో పలుచోట్ల కాలిబాటలను రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. ఆ సమయంలో జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల గుత్తేదారులు వాటిని సక్రమంగా అమర్చలేదు. దాంతో కొన్ని ఒరిగిపోవడం, మరికొన్ని నాణ్యత లేక విరిగిపోయి యథాస్థితికి చేరుకున్నాయి. వాణిజ్య దుకాణాలకు చెందిన కొంత మంది యజమానులు ఒరిగిపోయిన వాటిని సరి చేయగా, మరి కొందరు చొరవ చూపి విరిగిపోయిన పలకలపై చెక్కలు, దుంగలు ఏర్పాటు చేశారు. వెంటనే అధికారులు స్పందించి దెబ్బతిన్న పలకలను సరి చేయించి పాదచారులెవరూ ప్రమాదాల బారిన పడకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


వాంబేకాలనీకి వెళ్లే మలుపు వద్ద..

రూ.10 లక్షలతో అంచనాలు రూపొందించాం..



పీఎంపాలెం క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది కూడలి వరకూ ఇరువైపులా సేవా రహదారులపై ఉన్న పలకల పరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించాం. వాటికి మరమ్మతులు చేపట్టేందుకు రూ.10లక్షలు అవసరమని అంచనాలు రూపొందించాం. ఆ నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. త్వరలో పనులు చేపట్టి సక్రమంగా పలకలు అమర్చి ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటాం.

–పి.సింహాచలం, జెడ్సీ, జోన్–2

స్పందనకు వందనం

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

కాలువల్లో ఎట్టకేలకు పూడిక తొలగింపు

ఎండాడ, న్యూస్‌టుడే: గొల్లల ఎండాడలోని ప్రధాన కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి స్పందించారు. సిబ్బందితో కాలువల్లో పేరపోయిన వ్యర్థాలు తీయించి సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: తారకరామానగర్ (రుషికొండ)లో పందుల బెడద ఎక్కువగా ఉంది. –రణధీర్, తారకరామానగర్

సమాధానం: పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం.

–కిషోర్, ఆరోగ్య విభాగ అధికారి

సమస్య: రుషికొండ 100 అడుగుల మార్గంలో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. –స్థానికులు, రుషికొండ

సమాధానం: ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపడతాం.

–కెవెఎస్ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ

సమస్య: వివేకానందనగర్(ఎండాడ)లో విద్యుత్ దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం.

–స్థానికులు, వివేకానందనగర్

సమాధానం: విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

–సురేష్, విద్యుత్ ఏఈ

గ్రామాల అభివృద్ధికి కృషి: గంటా

ఆనందపురం, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆనందపురం మండలంలో గంభీరం, వేములవలస, లొడగలవానిపాలెం, తర్లువాడ గ్రామాల్లో జరిగిన పల్లె పండగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారుల అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఆనందపురం మండలంలో రూ.8.60 కోట్లతో బీటీ, సీసీ రోడ్లు, కాల్వలు మొదటి విడతగా నిర్మించనున్నామన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా 18 రకాల కుల, చేతి వృత్తులను గుర్తించి అర్హులకు శిక్షణ ఇవ్వనున్నారన్నారు. డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఎంపీపీ ఎం.శారదప్రియాంక, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


వేములవలసలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి బుధవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ బేడామండపంలోని సింహాసనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో స్వామిని సహస్రనామాలతో అర్చించారు. అనంతరం వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.


దేవతామూర్తులకు హారతిస్తున్న అర్చకుడు

డైట్‌లో ప్రపంచ ఆహార దినోత్సవం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ డైట్ కళాశాలలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్న భోజన సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రధానాచార్యులు ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ దేశంలో పోషకాహార కొరత ఉన్నందున దీని భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎక్కడా ఆహారం వృథా కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ ఉప ప్రధానాచార్యులు యు.మాణిక్యం నాయుడు, అధ్యాపకులు జి.జి.ఎస్.నాగేశ్వరరావు, గొట్టేట రవి, మధ్యాహ్న భోజన పథకం ఇన్‌ఛార్జి కె.కాళిదాసు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డైట్ ప్రధానాచార్యులు ఎం.జ్యోతికుమారి, ఛాత్రోపాధ్యాయులు

బెల్టు దుకాణంపై పోలీసుల దాడి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధి మారికవలస గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ క్రమంలో దుకాణ నిర్వాహకుడు గొర్లె చిన్న ప్రభుత్వ దుకాణంలో మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతనిపై ఆబ్కారీశాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అతని వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీన పర్చుకున్నట్లు సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.

630 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అనధికారికంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. చినముషిడివాడ ప్రాంతంలోని ఓ నివాసంలో పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం ఆధారంగా డీసీఎస్‌ఓ వి.భాస్కర్‌రావు, సిబ్బంది బుధవారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో 630 కిలోల పీడీఎస్ బియాన్ని అనధికారికంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని డీసీఎస్‌ఓ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

'విశ్వకర్మ యోజన'పై అవగాహన అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఎం.శ్రీభరత్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: సంప్రదాయ వృత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తక్కువ వడ్డీతో రుణం అందించే 'పీఎం విశ్వకర్మ యోజన' పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. పీఎంపాలెం జీవీఎంసీ కల్యాణ మండపంలో బుధవారం పీఎం విశ్వకర్మ యోజన పథకం అవగాహన కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అట్టడుగు వర్గాల ప్రజల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో అప్పటి ఎంపీలు విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాల ఫలితాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ పి.సింహాచలం, యూసీడీ పీవో డి.లక్ష్మి, డీపీవో కె.కనకమహాలక్ష్మి, 2, 5, 7 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, జోన్-2 ఏపీడీ గంగాధర్, తెదేపా, జనసేన, భాజపా నాయకులు దాసరి శ్రీనివాస్, గరే గురునాథ్, జి.సంతోష్‌నాయుడు, గంటా నూకరాజు, రెడ్డి సత్యనారాయణ, షేక్ సుభాని, కె.రామకృష్ణ, పెంటకోట బబ్బేలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న తిరు పవిత్రోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సామూహిక శ్రీవారి వ్రతాలు నిర్వహించారు. ఈ పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఐశ్వర్య వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్నాహ్నం అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్టీలు కె.సూర్యనారాయణమూర్తి, కె.శ్రీరామచంద్రమూర్తి, కె.వి.భానోజీరావు, అర్చకులు ముప్పిరాల అనంతాచార్యులు, పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.


శ్రీవారి వ్రత పూజలో పాల్గొన్న మహిళలు

అవీ ఇవీ

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: సింహాచలం తొలిపావంచా ఉప కేంద్రం పరిధిలోని 11కేవీ ధారపాలెం ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఫీడర్ పరిధిలోని కాపువీధి, కుమ్మరిదిబ్బ, అడివివరం, ధారపాలెం పరిసర ప్రాంతాల్లో సంబంధిత సమయాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని తెలియజేశారు.

ఎండాడ, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఎండాడ 33 కేవీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ కె.కె.చక్రవర్తి తెలిపారు. దీనివల్ల ఎండాడ, రాజీవ్‌నగర్, వరాహగిరినగర్, ముబారక్‌కాలనీ, సాగర్‌నగర్, సుభాష్‌నగర్, దసపల్లా లేఅవుట్, ఐటీ పార్కు, రామానాయుడు స్టూడియో తిమ్మాపురం హిల్ నంబరు 1, 2, 3, రుషికొండ ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పీజీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్తగా ప్రవేశపెట్టిన ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పీజీ కోర్సులో మిగుల సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. ఈమేరకు ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ మధ్య ఎమ్మెస్సీ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు అవసరమైన ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరు కావాలి. పీజీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రధానాచార్యులు డా.సి.హెచ్.విష్ణుమూర్తి కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో అంటురోగాలు తలెత్తకుండా పారిశుద్ధ్య నిర్వహణతోపాటు రక్షిత మంచినీటి సరఫరా సక్రమంగా చేపట్టాలని భీమిలి మండల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి కె.రమేష్‌నాయుడు పేర్కొన్నారు. భీమిలి మండలం మజ్జిపేట సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి అవసరమైన సూచనలు చేశారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సాయికుమార్ (పాతచిత్రం)

పీఎంపాలెం, న్యూస్‌టుడే: వివాహ వేడుకలో విద్యుత్తు పనులు చేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఆ వివరాలిలా.. రేవళ్లపాలెం గ్రామానికి చెందిన బెవర సరస్వతి భర్త మరణించడంతో ఇంటి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తోంది. పెద్ద కొడుకు అనిల్‌కుమార్ వాలంటీర్‌గా పని చేస్తూ ఎన్నికల ముందు రాజీనామా చేశాడు. చిన్న కుమారుడు బెవర సాయికుమార్(22) కొమ్మాది దేవీమెట్ట ప్రాంతానికి చెందిన ఓ ఈవెంట్ నిర్వాహకుడి వద్ద పని చేస్తున్నాడు. కొమ్మాదిలో బుధవారం రాత్రి ఓ వివాహ వేడుకకు సంబంధించి విద్యుత్తు పనులు చేస్తుండగా సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆ తర్వాత వివాహ వేదిక వద్ద విద్యుత్తు తీగలు కలుపుతుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సమీప ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్ శవాగారానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

'రైతుబంధు'తో ఉత్పత్తుల నిల్వకు ప్రోత్సాహం

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు పండించిన వరి, మొక్కజొన్న ఉత్పత్తులను రైతుబంధు పథకం ద్వారా యార్డుల్లో ఉచితంగా నిల్వ చేసుకోవచ్చని భీమిలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు బి.విజయప్రసాద్ పేర్కొన్నారు. భీమిలి మండలం దాకమర్రి, మజ్జివలసలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు సి.హెచ్.సుబ్రహమణ్యం మాట్లాడుతూ సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యవసాయాధికారులు శివకోమలి, సురేష్, రైతుసేవా కేంద్రం సిబ్బంది భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ బి.విజయప్రసాద్

నట్టల వ్యాధి నివారణ టీకాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని చంద్రంపాలెం పశువైద్యశాల వైద్యాధికారిణి ఆర్.అనుపమ కోరారు. ఈ నెల 31వ తేదీ వరకూ జరగనున్న నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం కొమ్మాదిలో గొర్రెలకు, మేకలకు వైద్యాధికారిణి అనుపమ ఆధ్వర్యంలో సిబ్బంది టీకాలు వేశారు. మధురవాడ పరిసర గ్రామాలకు చెందిన గొర్రెలు, మేకల పెంపకందారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా పెరిగేందుకు ఏటా విధిగా నట్టల నివారణ మందులు వాడాలని విశాఖ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ పేర్కొన్నారు. భీమిలి మండలం జె.వి.అగ్రహారంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 950 గొర్రెలకు ఈ మందు వేయించారు. భీమిలి పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటరమణ, తాళ్లవలస పశువైద్యశాల వైద్యులు డా.ఎస్.జి.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.


భీమిలి మండలం జె.వి.అగ్రహారంలో..


'రోటరాక్ట్' రక్తదాన శిబిరం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని గీతం విద్యార్థి విభాగం డీన్ కె.బాలాకుమార్, రొటేరియన్ డాక్టర్ స్వాతి చిక్కాల ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం అందించడం ద్వారా ప్రాణాలు నిలుస్తాయని ఈ క్రమంలో ప్రస్తుత అవసరాల్ని గుర్తించి యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్‌ల (రక్తనిధుల కేంద్రాల) నిపుణుల సమక్షంలో దాదాపు 200 మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు కె.జశ్వంత్, వాలంటీర్లు తదితరులు రక్తదానం చేసినవారిలో ఉన్నారు.


రక్తదానంలో పాల్గొన్న సభ్యులు

వైద్యానికి చేయూత

కొమ్మాది, న్యూస్‌టుడే: కంచరపాలెం ప్రాంతానికి చెందిన పేడాడ నాగరత్నం అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఏపీ కళింగ సంక్షేమ సేవాసంఘం ఆమెకు అండగా నిలిచింది. రాష్ట్ర అధ్యక్షుడు సీపాన వెంకటరమణ ఆధ్వర్యంలో రాష్ట్ర సలహాదారు ఎస్.వి.వి.ప్రసాద్‌రావు, కార్యదర్శులు బెండి నారాయణరావు, పాతిన శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ మొజ్జాడ రమణమూర్తి తదితరులు బుధవారం ఆమెకు రూ.35వేల నగదు, నిత్యావసర సరకులు అందజేశారు. భర్త మృతి చెందడం, పిల్లలు లేకపోవడంతో ప్రస్తుతం ఆమె తల్లితో కలిసి జీవిస్తోంది. ఇటీవల కిడ్నీలు పాడవ్వడంతో మెరుగైన చికిత్స కోసం ఈ సంక్షేమ సంఘం ఆమెకు చేయూతనిచ్చింది.


బాధితురాలికి నగదు, నిత్యావసర సరకులు అందిస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా..


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యాశాఖ అధికారులు

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జె.ఎస్.శాస్త్రి, ఎంఈవో అనురాధ అక్షయపాత్ర పంపిణీ చేస్తున్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. ఎంత మంది విద్యార్థులు ప్రతి రోజు భోజనం చేస్తున్నారో దస్త్రాలు తనిఖీ చేసి తెలుసుకున్నారు. ఎక్కువ మంది గుడ్డు తినడం లేదని గుర్తించారు. ఆ మేరకు నిర్వాహకులకు పలు సూచనలు చేసి విద్యార్థులంతా భోజనంతో పాటు గుడ్డు తినేలా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ (విశాఖపట్నం) గ్రూప్ 13 ఆంధ్రా బెటాలియన్ నుంచి 'బెస్ట్ ఎన్‌సీసీ అధికారి' అవార్డు రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్ (జీవీపీ) డిగ్రీ అండ్ పీజీ కోర్సుల కళాశాల ఎన్‌సీసీ విభాగాధికారి కెప్టెన్ ఆర్.బి.అనంతరావుకు మూడోసారి దక్కిందని జీవీపీ ప్రిన్సిపల్ ఆచార్య కె.ఎస్.బోస్ బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ వి.ఎం.రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన, పర్యావరణ పరిరక్షణ దిశగా మొక్కలు నాటడం, ఉచిత వైద్య, రక్తదాన శిబిరాల నిర్వహణ తదితర పలు సేవా కార్యక్రమాలను కెప్టెన్ అనంతరావు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు చేపట్టారన్నారు. ఈ నేపథ్యంలో మూడోసారి ఈ పురస్కారం లభించడం అభినందనీయమని జీవీపీ యాజమాన్య సభ్యులు కొనియాడారు.



వి.ఎం.రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న అనంతరావు

ఎట్టకేలకు సమస్యకు పరిష్కారం

ఈనాడు కథనానికి స్పందన


భీమిలిలో అల్లుకున్న పాదులు తొలగించాక..

భీమిలిలో పలు విద్యుత్తు స్తంభాలకు అల్లుకున్న పాదులను సిబ్బంది తొలగించారు. ఈ పాదుల వల్ల ప్రమాదం పొంచి ఉందంటూ ఈనెల 12వ తేదీన 'ఈనాడు'లో అల్లుకున్న నిర్లక్ష్యం శీర్షికన వెలువడిన కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. ఈమేరకు భీమిలి సెక్షన్ విద్యుత్తు సహాయ ఇంజినీరు యు.సకరయ్య పర్యవేక్షణలో సిబ్బంది ఈనెల 14, 15 తేదీల్లో ఆయా పాదులను తొలగించారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, భీమునిపట్నం

జీవీఎంసీ 8వ వార్డు పరిధి వైఎల్పీ లేఅవుట్ (ఎండాడ) ప్రధాన మార్గంలో విద్యుత్ స్తంభాలకు పాదులు అల్లుకుని తరచూ కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఈ సమస్యపై ఈ నెల 16వ తేదీన 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో వెలువడిన కథనానికి యంత్రాంగం స్పందించింది. సంబంధిత ఏఈ చక్రవర్తి ఆధ్వర్యంలో తీగలకు అల్లుకున్న పాదలను సిబ్బంది తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, ఎండాడ


ఎండాడ వైఎల్పీ లేఅవుట్ మార్గంలో..

పొంచి ఉన్న ప్రమాదం

ఎండాడ, న్యూస్‌టుడే: గీతం కళాశాల రోడ్డు మధ్యలో ఎండాడ కొండపైకి వెళ్లే కూడలి వద్ద గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. కొందరు వాహన చోదకులు ఈ స్తంభాన్ని ఢీకొనడంతో ఇలా తయారైందని స్థానికులు అంటున్నారు. ఈ మార్గంలో విద్యార్థులు, పర్యాటకులు, భక్తులు, ద్విచక్ర వాహన చోదకులు నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి కొత్త స్తంభం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

శివారు ప్రాంతాల్లో అంధకారం

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు తరచూ మొరాయిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో ఈ ఇబ్బంది అంతగా లేకున్నా శివారు ప్రాంతాల్లో ప్రజలను నిత్యం వేధిస్తోంది. స్థానిక రాజీవ్‌కాలనీ(ఎండాడ) నుంచి సన్ కళాశాలకు వెళ్లే మార్గంలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ముబారక్ కాలనీ నుంచి దసపల్లా లేఅవుట్, వెంకటేశ్వర ఆలయం దారిలోని వీధి దీపాలు కూడా సక్రమంగా వెలగడం లేదు. ఈ సమస్యపై ఫిర్యాదులకు స్పందించి సిబ్బంది బాగు చేస్తున్నా.. కొద్ది రోజులకే పరిస్థితి మళ్లీ మొదటికొస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రాజీవ్‌నగర్-సన్ కళాశాల మార్గంలో ఇలా..

విశాఖ తూర్పు

విద్యాసంస్థల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: మహిళలు, విద్యార్థినులు ఉండే ప్రతి విద్యాసంస్థ, కార్యాలయాల్లో లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిశీలించే అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని నిపుణురాలు డాక్టర్ వై.హేమ అన్నారు. సమత కళాశాలలో బుధవారం ఉదయం లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. నిపుణురాలు మాట్లాడుతూ.. వేధింపుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ చట్టం గురించి ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల డీన్ ఆచార్య విజయారవీంద్ర, ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాసరావు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

విభాగాలను పరిశీలించిన ఏయూ వీసీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం సైన్స్ కళాశాల పరిధిలోని అడ్వాన్స్ సైన్సెస్ భవన్‌లో పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభాగాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆచార్య వి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: వివాహ వేదికలో విద్యుత్తు పనులు చేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఆ వివరాలివీ.. రేవళ్లపాలెం గ్రామానికి చెందిన బెవర సరస్వతి భర్త మరణించడంతో ఇంటి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తోంది. పెద్ద కుమారుడు అనిల్‌కుమార్ వాలంటీర్‌గా పని చేస్తూ ఎన్నికల ముందు రాజీనామా చేశారు. చిన్న కుమారుడు బెవర సాయికుమార్(22) కొమ్మాది దేవీమెట్ట ప్రాంతానికి చెందిన ఓ ఈవెంట్ నిర్వాహకుడి వద్ద పని చేస్తున్నాడు. కొమ్మాదిలో బుధవారం రాత్రి ఓ వివాహ వేడుకకు సంబంధించి విద్యుత్తు పనులు చేస్తుండగా సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆ తర్వాత వివాహ వేదిక వద్ద విద్యుత్తు తీగలు కలుపుతుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సమీప ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్ శవాగారానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఏడేళ్ల తర్వాత నర్సుల సంఘానికి ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలకు సంబంధించి బుధవారం నామపత్రాలు దాఖలయ్యాయి. రెండు ప్యానళ్లకు చెందిన 19 మంది నామపత్రాలు అందజేశారని ఎన్నికల అధికారి, సహకారశాఖ సహాయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యదర్శి పోస్టుకు ముగ్గురు, అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి, కార్యవర్గ సభ్యుల పదవులకు ఇద్దరు చొప్పున నామపత్రాలు అందజేశారు. వాటిని ఈనెల 17న పరిశీలించనున్నారు. 18వ తేదీ సాయంత్రం వరకు ఉపసంహరణకు గడువు ఉంది. ఈనెల 28న ఎన్నిక నిర్వహించనున్నారు. సంఘంలో 555 మంది సభ్యులు ఉన్నారు. టి.గంగాభవాని అధ్యక్షురాలిగా ఒక ప్యానెల్, వి.ఉషారాణి అధ్యక్షురాలిగా ఒక ప్యానెల్ నామపత్రాలు దాఖలు చేశారు. దాదాపు 7ఏళ్ల విరామం తర్వాత నర్సుల సంఘానికి ఎన్నికలు జరుగుతుండడంతో కేజీహెచ్‌లో కోలాహలం నెలకొంది. సహకారశాఖ అధికారి పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరగబోతోంది.

వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి బుధవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ బేడామండపంలోని సింహాసనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో స్వామిని సహస్రనామాలతో అర్చించారు. అనంతరం వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

వీధి వ్యాపారులకు అండగా...

కేంద్ర ప్రభుత్వ పథకాలపై సర్వే

న్యూస్‌టుడే, ఎఫ్.ఎం.కాలనీ (ఎంవీపీకాలనీ)



మహిళలకు పథకాల గురించి తెలియజేస్తున్న సిబ్బంది

రహదారులకు ఇరువైపులా చిరు వ్యాపారం చేసుకుని జీవనోపాధి పొందుతున్న వారికి మరింతగా చేయూత అందించేలా ప్రభుత్వం వారి సామాజిక స్థితిగతులను తెలుసుకునేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలకు వీరంతా అర్హులైనా చాలా వరకు సద్వినియోగం చేసుకోకపోవటంతో వారందరిని భాగస్వాముల్ని చేసేందుకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

కుటుంబ వివరాలు సేకరణ

కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల కోసం పి.ఎం.స్వయం నిధి యోజన (ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి) పేరిట రుణాలను ఇస్తోంది. వీధి వ్యాపారులు తమ జీవనోపాధిని మెరుగుపరిచేలా జాతీయ స్థాయి బ్యాంకుల నుంచి రూ.10వేల నుంచి రూ.50వేల వరకు యూసీడీ అధికారుల ద్వారా ఇవ్వటం జరుగుతోంది. ఇలా రుణాలను తీసుకున్న వారి కుటుంబాల సామాజిక స్థితిగతులను తెలుసుకుని, వారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు రకాల పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారా? లేదా అనే వివరాలను తెలుసుకుంటున్నారు.

■ వీధి వ్యాపారుల కుటుంబాలకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సుమారు 8 రకాల పథకాల గురించి వివరిస్తున్నారు. పి.ఎం. సురక్ష బీమా, పి.ఎం. శ్రమ యోగి యోజన, ఒన్ నేషన్ ఒన్ రేషన్‌కార్డు, పి.ఎం.జనని సురక్ష యోజన, పి.ఎం.మాతృ వందన యోజన వంటి పథకాలను వివరిస్తున్నారు.

■ జీవీఎంసీ పరిధిలో గతంలో పీఎం స్వయం నిధి యోజన పథకం కింద రుణాలు తీసుకున్న వారి కుటుంబాల వివరాలు మాత్రమే ప్రస్తుతం సేకరిస్తున్నారు. వారందరితో అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి పథకాల గురించి వివరిస్తున్నారు.

■ పథకాలను సద్వినియోగం చేసుకోలేని వారికి ఆయా ప్రభుత్వ విభాగాలకు ఆన్‌లైన్ ద్వారా వివరాలను పొందుపరుస్తున్నారు. అనంతరం మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ, బీమా, బ్యాంకులు, కార్మికశాఖ ఇలా ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా ఆయా వీధి వ్యాపారులకు రావాల్సిన పథకాలకు అర్హులను చేసి వారిని జీవన విధానాన్ని మెరుగుపరిచేలా చర్యలు చేపడుతున్నారు.

■ ఇప్పటికే జీవీఎంసీ పరిధిలో 50వేల మందికిపైగా వ్యాపారులు ఉండగా, వారి నుంచి కుటుంబసభ్యుల వివరాలను తెలుసుకుని, ఆన్‌లైన్‌లో వారు ఇచ్చిన సమాచారాన్ని పొందుపరిచారు. అనంతరం జోన్‌ల వారీగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించి వారిని చైతన్యపరుస్తున్నారు.

■ యూసీడీ విభాగం అధికారులు, ఆర్పీల సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహించి, ఆయా పథకాలను ఎలా పొందాలి? అందుకు అవసరమైన దస్త్రాలు, ఇతరత్రా సహకారాన్ని అందిస్తున్నారు. జోన్-3 పరిధిలో సుమారు 8 నుంచి 10 వేల మందికి ప్రయోజనాలు చేకూరేలా సర్వే ద్వారా వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

నిత్యావసర ధరలను తగ్గించాలని ధర్నా

ఆరిలోవ, న్యూస్‌టుడే: పాత ఆరిలోవ అంబేడ్కర్ కూడలిలో బుధవారం సీపీఐ నాయకులు పెరిగిన నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని కోరుతూ ధర్నా చేశారు. పాత ఆరిలోవ, బాలాజీనగర్ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి షేక్ రెహమాన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యురాలు ఎ.దేవుడమ్మ, కార్యదర్శి కె.లక్ష్మణరావు, కాసుబాబు, పుష్పలత, చిరంజీవి, రవి, నూకరాజు, సత్తిబాబు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న సీపీఐ నాయకులు

జిరాక్స్ మిషన్ అందజేత

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : చదువుకునే విద్యార్థులకు లయన్స్ క్లబ్ ద్వారా తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని లయన్స్ బ్లడ్ బ్యాంక్ ట్రస్టీ ఆచార్య ఎన్.వి.ఎన్.దుర్గాప్రసాద్ అన్నారు. రామ్‌నగర్ లయన్స్ కమ్యూనిటీ హాల్లో బుధవారం ఉదయం లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో డాక్టర్ వి.ఎస్.కృష్ణా జూనియర్ కళాశాలలకు రూ.75 వేల విలువ చేసే జిరాక్స్ మిషన్‌ను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్.కృష్ణారావుకు అందజేశారు. క్లబ్ అధ్యక్షులు కిశోర్ గుప్తా, లయన్ ప్రసాదరాజు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



జిరాక్స్ మిషన్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

20 నుంచి ఆయుర్వేద వైద్య శిబిరం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రామ్‌నగర్ జీవీఎంసీ ఔట్‌గేటు ఎదురుగా వైద్యరాజ ఔషధ శాలలో 20, 21 తేదీల్లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఉన్నికృష్ణన్ తెలిపారు. చర్మవ్యాధులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, సొరియాసిస్, ఒత్తిడి, ఈఎన్టీ, ఆందోళన, కీళ్ల సమస్యలు, నడుము నొప్పి, నిద్రలేమి, స్పాండ్‌లైటిస్ లాంటి సమస్యలకు వైద్యం అందిస్తామన్నారు. 22, 23 తేదీల్లో మురళీనగర్ శ్రీదేవి పార్కు సమీపంలో రెండు రోజుల పాటు వైద్య శిబిరం జరగనుందన్నారు. ఇతర వివరాలకు 80080 00670 నెంబరులో సంప్రదించాలన్నారు.

చిత్ర బృందం సందడి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సిరిపురంలోని ఓ హోటల్లో 'ఎంత పనిచేశావ్ చంటి' చిత్ర బృందం ప్రచార కార్యక్రమంలో పాల్గొంది. ఈ సందర్భంగా హీరో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈనెల 25న ఈ చిత్రం విడుదల కానుందన్నారు. ఓ కుటుంబంలో జరిగే సంఘటన ఆధారంగా ఈ చిత్ర నిర్మాణం చేసినట్లు తెలిపారు. ఈనెల 19న నర్సాపూర్‌లో ఆడియో ఫంక్షన్, 22న డాబాగార్డెన్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సినిమా ప్రీరిలీజ్ ఫంక్షన్ జరుగుతుందన్నారు. యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



'ఎంత పనిచేశావ్ చంటి' చిత్ర బృందం

పరిశ్రమలతో యువతను అనుసంధానం చేయండి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: పరిశ్రమలతో యువతను అనుసంధానం చేస్తూ వారిలో ఉపాధి నైపుణ్యాలను పెంచేదిశగా కృషి చేయాలని ఏపీ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ విభాగం డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ అన్నారు. బుధవారం ఆయన ఏయూను సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలానుగుణంగా ఉపాధిని సృష్టించే నూతన కోర్సులకు రూపకల్పన చేసి అందించాలన్నారు. ఏయూ అభివృద్ధిలో తమవంతు సహకారాన్ని అందజేస్తానన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయనను సత్కరించారు.



మాదిరెడ్డి ప్రతాప్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆనందమార్గ ఆశ్రమానికి వితరణ

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు పరిధిలోని ఇందిరానగర్‌లో ఆనందమార్గ ఆశ్రమ విద్యార్థులకు నగరంలోని రాజ్యలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, టవళ్లు, నిత్యావసర సరకులు అందించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు ఆచార్య సౌమ్యానంద అవధూత, ఫౌండేషన్ ప్రతినిధులు నారాయణ, కోదండరావు, దీనబంధు, పార్వతి, గంగ, బాలాజీ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల ఏర్పాటులో తప్పేముంది : హైకోర్టు

ఈనాడు, అమరావతి: విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) మైదానంలో దీపావళికి టపాసులను విక్రయించేందుకు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వకుండా అధికారులను నిలువరించాలంటూ పిటిషనర్ చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. దీపావళి సందర్భంగా మూడు రోజులపాటు జనావాసాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేస్తే తప్పేముందని వ్యాఖ్యానించింది. పిటిషనర్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లో మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు స్పష్టంచేసింది. విచారణను నవంబర్ 1కి వాయిదా వేసింది.

★ ఏయూ పరిధిలోని 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న 1500 చెట్లను కూల్చివేశారని, అందుకు అటవీశాఖ అధికారుల అనుమతి లేదని, వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధంగా కొట్టేశారని, కుంటలు, నీటి ప్రవాహ ప్రాంతాలను(గెడ్డలను) పూడ్చి వేస్తున్నారని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ 2022లో హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో తాజాగా అనుబంధ పిటిషన్ వేస్తూ.. దీపావళికి టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఏయూ మైదానంలో భూమిని చదును చేస్తున్నారన్నారు. మైదానానికి సమీపంలో విద్యార్థుల వసతిగృహం ఉందన్నారు. ఏయూ, జిల్లా కలెక్టర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 15 ఏళ్లుగా ఆ మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. జనావాసాలకు దూరంగా అదే సురక్షిత ప్రాంతమన్నారు. కేవలం మూడు రోజులు మాత్రమే దుకాణాలకు అనుమతిస్తున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం దుకాణాల ఏర్పాటును నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. అనుబంధ పిటిషన్ నిరర్థకం అయ్యేందుకు ఉద్దేశపూర్వకంగానే విచారణను నవంబర్ 1కి వాయిదా వేస్తున్నట్లు వ్యాఖ్యానించింది.

రహదారులు జలమయం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగరంలో బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి రహదారులు చాలా వరకు జలమయమయ్యాయి. జాతీయ రహదారి ఇసుకతోట కూడలి, ఎంవీపీకాలనీ ఆళ్వార్‌దాస్ కూడలి, ఇతర సెక్టార్లలో వర్షపు నీరు నిలిచిపోయింది. భారీ వర్షంతో గెడ్డలు పొంగి పొర్లాయి. చాలా సేపటి వరకు నీరు అలాగే నిలబడి ఉంది.



జాతీయ రహదారి ఇసుకతోట సమీపంలో నిలిచిన వర్షపు నీరు



ఎంవీపీ వీధుల్లో నిలిచిన వర్షపు నీరు

630 కిలోల రేషను బియ్యం పట్టివేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అనధికారికంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. చిన ముషిడివాడ ప్రాంతంలోని ఓ నివాసంలో పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం ఆధారంగా డీసీఎస్‌ఓ వి.భాస్కర్‌రావు, సిబ్బంది బుధవారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో 630 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అనధికారికంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని డీసీఎస్‌ఓ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.


వీధులన్నీ చీకటే..

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ



వీధుల్లో వెలగని వీధి దీపాలు

ఎంవీపీకాలనీ సెక్టారు-3లో వీధి దీపాలు వెలగడం లేదు. సచివాలయాల్లో ఎన్ని ఫిర్యాదులు అందినా ఫలితం శూన్యమనే చెప్పాలి. చీకటి పడితే చాలు అన్ని వీధుల్లోనూ వీధి దీపాలు వెలగని దుస్థితి నెలకుంది. వర్షాకాలం కావడంతో వేగంగా చీకటి పడుతుండటంతో వీధి దీపాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకటి కావటంతో గుమ్మాల్లో ఉన్న దీపాలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. దాదాపుగా సెక్టారు-3లో 20 వరకు వీధి దీపాలు వెలగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచాలని కోరుతున్నారు.



ఓ ఇంటి గుమ్మం నుంచి వచ్చే వెలుగే ఆ వీధికి దిక్కు..

సంతకూ అదే పరిస్థితి..

ఆరిలోవ, న్యూస్‌టుడే



సంత ప్రాంతంలో సొంత దీపాల వెలుతురులో వ్యాపారాలు

పాత ఆరిలోవ దుర్గాలమ్మ గుడి కూడలిలో ప్రతీ మంగళవారం సంత జరుగుతుంది. పలు ప్రాంతాల నుంచి అమ్మకందారులు వస్తుంటారు. అయితే సాయంత్రం 5 నుంచి వెలుతురు లేక సంతలో వ్యాపారస్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సొంతంగా సోలార్ దీపాలను తెచ్చుకోవాల్సి వస్తోంది. జీవీఎంసీ అధికారులు పరిశీలించి కూడలిలో దీపాలు అమర్చాలని కోరుతున్నారు.

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ సబ్‌స్టేషను 33/11 కె.వి. పైనాపిల్‌కాలనీ ఎస్.ఎస్.లో మరమ్మతులు పని చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్ 3 ఇ.ఇ. ఆపరేషన్స్, పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పైనాపిల్‌కాలనీ, ముడసర్లోవ, రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్.నగర్, కామాక్షినగర్, సీఐడీ ఆఫీసు, శ్రీకాంత్‌నగర్ లేఅవుట్, కనకమహాలక్ష్మి నగర్, రాజీవ్‌నగర్, పోలీస్ స్టేషన్, టీఐసీ పాయింట్, పాండురంగాపురం, ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ ప్రాంతం, నెహ్రూనగర్, దుర్గాబజార్, లక్ష్మీనగర్, శివాజీనగర్, ప్రగతినగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : సిరిపురం కూడలి దత్ ఐలాండ్ వద్ద జీవీఎంసీ మొక్కలు పెంచే కుండీల్లో నీటి నిల్వలు పెరిగిపోయాయి. దోమల బెడద పెరిగింది. – ఎన్.ఎస్.బి.శర్మ

సమాధానం : పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – గోవింద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-11 86/ఎ/9 పోల్‌పై వీధి దీపాలు వెలగటం లేదు. – సింహాద్రి

సమాధానం : సిబ్బందిని నియమించి పాడైన దీపాలను మారుస్తాం. – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

సమస్యలు తిష్ఠ వేశాయి

శివాజీపాలెం, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే



పీతలవానిపాలెంలో అసంపూర్తిగా యూజీడీ పనులు

జీవీఎంసీ పరిధి 22వ వార్డు శివాజీపాలెం, పీతలవానిపాలెం, పిఠాపురంకాలనీ పలు ప్రాంతాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. దీంతో ఆయా ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా భూగర్భ డ్రైనేజీ కోసం తీసిన గోతులు అసంపూర్తిగా వదిలేశారు. వార్డులో చాలాచోట్ల అపరిశుభ్ర పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



పిఠాపురంకాలనీలో రోడ్డు పక్కన వ్యర్థాలు

ఏయూ స్థల ఆక్రమణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్, పోలీస్ మెస్ మధ్యన ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఖాళీ స్థలం ఆక్రమణకు గురైంది. ఇందులో రెండు దుకాణాలు, ఒక విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం ఉదయం వెళ్లి పరిశీలించారు. అందులో ఒక దుకాణం ప్రైవేటుది కాగా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్, మరో దుకాణం జీవీఎంసీకి చెందినవిగా గుర్తించారు. ప్రైవేటు దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించారు. అనుమతి లేకుండా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడమే కాకుండా దుకాణం పెట్టడం చట్టవిరుద్ధమని, జీవీఎంసీ అధికారులకు నోటీసు జారీ చేయాలని ఏయూ ఇంజినీర్లను ఆదేశించారు. ఇక్కడ ఖాళీ స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మించినప్పటికి ఒకవైపు గోడ పడిపోవడంతో నేరుగా అందులోకి ప్రవేశించినట్లు అధికారులు గుర్తించారు.



బీచ్‌రోడ్డులోని ఏయూ ఖాళీ స్థలంలో ఉంచిన దుకాణాలు

చంద్రన్న పట్టాదారులకు యాజమాన్య హక్కు కల్పించేలా చర్యలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : గత తెదేపా ప్రభుత్వ హయాంలో 296, 301, 388, 279 జీవోల ప్రకారం ప్రభుత్వ భూముల్లో స్థిరనివాసం ఏర్పరచుకుని ఉంటున్నవారికి భూములు క్రమబద్ధీకరించి, పట్టాలు పంపిణీ చేయటం జరిగిందని.. వీరందరికి యాజమాన్య హక్కు కల్పించేలా చర్యలు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. పట్టాలు పొందిన రెండేళ్లకే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉన్నా.. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో అనేక మంది యాజమాన్య హక్కు లేకపోవటంతో నిర్మాణాలు చేపట్టలేకపోయారన్నారు.



కలెక్టర్ ప్రభుత్వానికి రాసిన లేఖను చూపుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ల దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లగా.. జిల్లా కలెక్టర్ ఈ జీవోలకు సంబంధించిన పరిస్థితిపై పూర్తిస్థాయి నివేదికను స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్యకార్యదర్శికి వివరిస్తూ లేఖను రాశారన్నారు. ఈ లేఖలో 296, 301, 388, 279 జీవోల మేరకు లబ్ధి పొందిన వారందరికి న్యాయం చేయాలని, యాజమాన్య హక్కు కల్పించాలని కోరారన్నారు. 296 జీవోను కొనసాగించటం ద్వారా మరింత ఎక్కువ మంది ప్రయోజనం పొందే అవకాశం ఉందని కోరారన్నారు. ఈ విషయమై మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పట్టాదారులకు రిజిస్ట్రేషన్ చేసుకునేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

శిశుగృహను సందర్శించిన న్యాయమూర్తి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశుగృహను జిల్లా న్యాయ సేవల సాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ బుధవారం సందర్శించారు. శిశుగృహలోని చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఇటీవల అనధికార శిశువిక్రయాలకు సంబంధించిన చిన్నారుల వివరాలను తెలుసుకున్నారు. దత్తతకు సిద్ధంగా ఉన్న చిన్నారుల వివరాలను తెలుసుకున్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ పి.డి జయదేవి, శిశుగృహ మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ ఎస్.వి.ఎస్.రామలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న న్యాయమూర్తి శేషమ్మ

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

అంతర్గత ఫిర్యాదుల కమిటీతో లైంగిక వేధింపులకు అడ్డుకట్ట

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: మహిళలు, విద్యార్థినులు ఉండే ప్రతి విద్యాసంస్థ, కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నివారణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని డాక్టర్ వై.హేమ సూచించారు. సమత కళాశాలలో బుధవారం ఉదయం లైంగిక వేధింపుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. నిపుణురాలు హేమ మాట్లాడుతూ లైంగిక వేధింపుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ చట్టం గురించి ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల డీన్ ఆచార్య విజయార వీంద్ర, ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాసరావు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

19 నుంచి అన్నదానం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: అయ్యప్ప మాల ధరించే భక్తులకు ఈనెల 19 నుంచి అన్నదానానికి అన్ని ఏర్పాట్లు చేశామని వేదిమలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు. పోర్టు ప్రధాన కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారి పక్కన ఖాళీ స్థలంలో డిసెంబరు 24 తేదీ వరకు అన్నదానం కొనసాగిస్తామని, స్వాములు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రేపు బీఎస్ఎన్ఎల్ డీఎల్సీ క్యాంప్

మురళీనగర్, డాబాగార్డెన్స్, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్, డీఓటీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్) పింఛనుదారులు, ఫ్యామిలీ పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ అందజేసేందుకు శుక్రవారం ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నారు. సంస్థ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమంలో జీవితకాల సర్టిఫికెట్లను అందజేస్తారు. పింఛనుదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: వివాహ వేదికలో విద్యుత్తు పనులు చేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు.



బెవర సాయికుమార్ (పాతచిత్రం)

ఆ వివరాలు... రేవళ్లపాలెం గ్రామానికి చెందిన బెవర సరస్వతి భర్త మరణించడంతో ఇంటి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తోంది. పెద్ద కొడుకు అనిల్‌కుమార్ వాలంటీర్‌గా పని చేస్తూ ఎన్నికల ముందు రాజీనామా చేశారు. చిన్న కుమారుడు బెవర సాయి కుమార్(22) కొమ్మాది దేవిమెట్ట ప్రాంతానికి చెందిన ఓ ఈవెంట్ నిర్వాహకుడి వద్ద పని చేస్తున్నాడు. కొమ్మాదిలో బుధవారం రాత్రి ఓ వివాహ వేడుకకు సంబంధించి విద్యుత్తు పనులు చేస్తుండగా సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో విద్యుత్ తీగను తాకడంతో కిందపడ్డాడు. ఆ తర్వాత వివాహ వేదిక వద్ద విద్యుత్తు తీగలు కలుపుతుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సమీప ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని కేజీహెచ్ శవాగారానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

సింధియా, న్యూస్‌టుడే: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలు... బిహార్‌లోని పట్నాకు చెందిన విక్కీకుమార్ విశాఖ నౌకాదళంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఝార్ఖండ్‌కు చెందిన కుసుమకుమారి(28)తో 2020లో వివాహమైంది. వారు బర్మాకాలనీలో నివాసం ఉంటున్నారు. ఉదయం విక్కీకుమార్ విధులకు వెళ్లగా, 10.30 గంటల సమయంలో కుసుమకుమారి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్ పర్యవేక్షణలో సిబ్బంది కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విభాగాలను పరిశీలించిన ఏయూ వీసీ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం సైన్సు కళాశాల పరిధిలోని అప్లైడ్ సైన్సెస్‌కు చెందిన పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభాగాల్లో మౌలిక వసతుల ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిరాక్స్ మిషన్ వితరణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: చదువుకునే విద్యార్థులకు లయన్స్ క్లబ్ ద్వారా సహాయ సహకారాలు అందజేస్తామని లయన్స్ బ్లడ్ బ్యాంక్ ట్రస్టీ ఎస్.వి.ఎస్.దుర్గాప్రసాద్ అన్నారు. రామనగర్ లయన్స్ కమ్యూనిటీ హాల్లో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో డాక్టర్ వి.ఎస్.కృష్ణా జూనియర్ కళాశాలకు రూ.75 వేల విలువచేసే జిరాక్స్ మిషన్‌ను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎస్.కృష్ణారావుకు అందజేశారు. క్లబ్ అధ్యక్షులు కిషోర్ గుప్తా, లయన్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు.. భారీ గుంతలు

జగదాంబ-పాతపోస్టాఫీసు రహదారి దుస్థితి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగదాంబ-పాతపోస్టాఫీసు రహదారి విస్తరణ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. మరోవైపు వర్షాల కారణంగా భారీ గుంతలు పడ్డాయి. దీంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణం, నడక మార్గం నిర్మాణ పనులను మూడు ప్యాకేజీల కింద గుత్తేదారులకు అప్పగించారు. వారి మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. జీవీఎంసీ ఇంజినీర్లు సైతం రహదారి నిర్మాణంపై దృష్టి సారించక పోవడంతో పనులు నెమ్మదించాయి. గుత్తేదారులకు నచ్చినప్పుడు పనులు చేపడుతూ కాలం వెళ్లదీస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కేజీహెచ్ డౌన్ నుంచి జగదాంబ కూడలికి వచ్చే రహదారిలో బిలాండ్ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ప్రమాదకర పరిస్థితులు ఉన్నట్లు జులై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. గుత్తేదారు స్పందించి బిలాండ్ పనులు చేపట్టారు. మిగతా పనులను సైతం త్వరగా చేసి రహదారి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

✦ రెండేళ్లుగా రహదారి నిర్మాణం కొనసాగుతుండడంతో వ్యాపారాలు కోల్పోయామని స్థానిక దుకాణదారులు వాపోతున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి తిరిగి వ్యాపారాలు పుంజుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధ్వానంగా మారిన రహదారికి మరమ్మతులు చేపట్టాలని విన్నవిస్తున్నారు. మరో వైపు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు నడక మార్గాలను అభివృద్ధి చేయగా, పలువురు వాటిని ఆక్రమించి మళ్లీ వ్యాపారాలు ప్రారంభించారు. వారిని తక్షణమే ఖాళీ చేయించి ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉంది. రహదారి మధ్యలో ఉన్న కేబుళ్లు, ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు పనులు ఓ కొలిక్కి వచ్చాయి. ఈ నేపథ్యంలో బీటీ లేయర్ నిర్మాణం సైతం అధికారులు త్వరగా పూర్తి చేస్తే బాగుంటుందని వాహన చోదకులు చెబుతున్నారు.



ఏవీఎన్ కళాశాల డౌన్‌లో ఛిద్రమైన రహదారి

త్వరలో పూర్తి చేయిస్తాం...



జగదాంబ-పాతపోస్టాఫీసు రహదారి నిర్మాణం ఆలస్యమవుతుండడంపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో చర్చించాం. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నెల రోజుల్లో పూర్తయ్యేలా చూడాలని కోరా. దెబ్బతిన్న రహదారిని జెట్టీతో కలిసి పరిశీలించాం. వెంటనే గుంతలను పూడ్చాలని ఆదేశించాం. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం.

–వంశీకృష్ణ శ్రీనివాస్, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే



బురుజుపేట సమీపంలో..

పీఎం విశ్వకర్మ యోజనతో ఆర్థిక భరోసా

అల్లిపురం, న్యూస్‌టుడే: పీఎం విశ్వకర్మ యోజన పథకంతో చిరు వ్యాపారులకు ఉపాధితోపాటు ఆర్థిక భరోసా కలుగుతుందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. సూర్యబాగ్ జోన్-4 కార్యాలయంలో పీఎం విశ్వకర్మ యోజన పథకంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని చేతి వృత్తిదారులు వినియోగించుకోవాలన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కులవృత్తులకు అతీతంగా 19 రకాల వృత్తుల వారికి 7రోజులపాటు శిక్షణ ఇచ్చి రూ.500 అందజేస్తారన్నారు. వ్యాపారాభివృద్ధికి మొదటి విడతలో రూ.లక్ష, రెండో విడతలో రూ.2లక్షలు అందించనున్నట్లు చెప్పారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు, ఏపీఈ పుణ్యవతి, తెదేపా దక్షిణ నియోజకవర్గ బాధ్యులు సీతంరాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు


ఉపాధి సృష్టించే నూతన కోర్సులు అవసరం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: పరిశ్రమలతో యువతను అనుసంధానం చేస్తూ వారిలో ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని ఏపీ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ విభాగం డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ అన్నారు. బుధవారం ఆయన ఏయూను సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలానుగుణంగా ఉపాధిని సృష్టించే నూతన కోర్సులకు రూపకల్పన చేసి అందించాలన్నారు. ఏయూ అభివృద్ధిలో తమవంతు సహకారాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయనను సత్కరించారు.



మాదిరెడ్డి ప్రతాప్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వైభవంగా సహస్రనామార్చన



దేవతామూర్తులకు హారతిస్తున్న అర్చకుడు

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి బుధవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేదపఠనాలు మధ్య స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ బేడామండపంలోని సింహాసనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో స్వామిని సహస్రనామాలతో అర్చించారు. అనంతరం వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

పాతనగరంలో నీటి సరఫరా మెరుగుపడాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాతనగరంలో మంచినీటి సరఫరాను మెరుగుపరచాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. 36వ వార్డు పరిధి పోలమ్మగుడి ప్రాంతం, రంగిరీజువీధిలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా భూగర్భ మురుగునీటి వ్యవస్థ పైపులైన్లతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రంగిరీజు వీధి సచివాలయం వద్ద సులభ్ కాంప్లెక్సును తొలగించి సామాజిక భవనం నిర్మించాలన్నారు. ఆ భవనంలో గ్రంథాలయం కొనసాగుతుందని, సొంత భవనం సమకూర్చాలని కోరారు. సత్యనారాయణ దేవాలయం వద్ద ప్రహరీ నిర్మించాలని స్థానికులు విన్నవించారు. జెడ్సీ మల్లయ్యనాయుడు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



రంగిరీజు వీధిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

జ్ఞానాపురం, న్యూస్‌టుడే

?: 41వ వార్డులో వీధికుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోంది. రాత్రుళ్లు బయటకు రావాలంటే భయమేస్తోంది.– రాంబాబు, జ్ఞానాపురం

సమాధానం: మీ ప్రాంతంలోని కుక్కల బెడదను జీవీఎంసీ పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

– ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే

?: జీవీఎంసీ 33వ వార్డులోని పలు ప్రాంతాల్లో నాలుగు రోజుల నుంచి చెత్తను తొలగించలేదు. వార్డు పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదు. – రాజు, అల్లిపురం

సమాధానం: సంబంధిత అధికారులతో మాట్లాడి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కృష్ణంరాజు, జోన్-4 ఏఎంహెచ్‌వో

630 కిలోల రేషను బియ్యం పట్టివేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అనధికారికంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. చినముషిడివాడ ప్రాంతంలోని ఓ నివాసంలో పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం ఆధారంగా డీసీఎస్ఓ వి.భాస్కర్‌రావు, సిబ్బంది బుధవారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో 630 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అనధికారికంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని డీసీఎస్ఓ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.



పట్టుబడ్డ రేషను బియ్యంతో డీసీఎస్ఓ భాస్కర్‌రావు

వేడుకగా తెన్నేటి యూత్ కమిటీ దసరా ఉత్సవాలు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-9 తెన్నేటినగర్‌లో ఏర్పాటు చేసిన విజయదుర్గా నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తెన్నేటి యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత పూజల్లో భాగంగా మహిళలచే బుధవారం కుంకుమ పూజలు నిర్వహించారు. విగ్రహదాత తమ్మినేని వెంకటేష్ నెలకొల్పిన అమ్మవారి విగ్రహానికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.





పూజలందుకుంటున్న దుర్గామాత, కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు

ఏయూ మైదానంలో టపాసుల దుకాణాల ఏర్పాటులో తప్పేముంది: హైకోర్టు

ఈనాడు, అమరావతి: విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) మైదానంలో దీపావళి టపాసులను విక్రయించేందుకు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వకుండా అధికారులను నిలువరించాలంటూ పిటిషనర్ చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. దీపావళి సందర్భంగా మూడు రోజులపాటు జనావాసాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేస్తే తప్పేముందని వ్యాఖ్యానించింది. పిటిషనర్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లో మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు స్పష్టంచేసింది. విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది.

✦ ఏయూ పరిధిలోని 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న 1500 చెట్లను కూల్చివేశారని, అందుకు బాధ్యులైన అధికారులు అనుమతి లేదని, వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధంగా కొట్టేశారని, కుంటలు, నీటి ప్రవాహ ప్రాంతాలను(గెడ్డలను) పూడ్చి వేస్తున్నారని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ 2022లో హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో తాజాగా అనుబంధ పిటిషన్ వేస్తూ.. దీపావళికి టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఏయూ మైదానంలో భూమిని చదును చేస్తున్నారన్నారు. మైదానానికి సమీపంలో విద్యార్థుల వసతిగృహం ఉందన్నారు. ఏయూ, జిల్లా కలెక్టర్ తరఫు న్యాయవాదుల వాదనలు వినిపిస్తూ.. 15 ఏళ్లుగా ఆ మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. జనావాసాలకు దూరంగా అదే సురక్షిత ప్రాంతమన్నారు. కేవలం మూడు రోజులు మాత్రమే దుకాణాలకు అనుమతిస్తున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం దుకాణాల ఏర్పాటును నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. అనుబంధ పిటిషన్ నిర్ణయకు అయ్యేందుకు ఉద్దేశపూర్వకంగానే విచారణను నవంబర్ 18 వాయిదా వేస్తున్నట్లు వ్యాఖ్యానించింది.

4 కిలోల గంజాయి స్వాధీనం

పెందుర్తి, న్యూస్‌టుడే: అరకు నుంచి నగరానికి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పెందుర్తి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పెందుర్తి మండలం సరిపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ కారులో గంజాయిని గుర్తించారు. నిందితులు ఒడిశా రాష్ట్రం కోరాపుట్ ప్రాంతానికి చెందిన రాంబాబు అలియాస్ (32), కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఇమ్మాన్యుయేల్ దాకవరపు (28)ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి నాలుగు కిలోల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై గతంలో టూ టౌన్, అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు.

ఏడేళ్ల తర్వాత నర్సుల సంఘానికి ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలకు సంబంధించి బుధవారం నామపత్రాలు దాఖలయ్యాయి. రెండు ప్యానళ్లకు చెందిన 19 మంది నామపత్రాలు అందజేశారని ఎన్నికల అధికారి, సహకారశాఖ సహాయ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యదర్శి పోస్టుకు ముగ్గురు, అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి, సంయుక్త కార్యదర్శి పదవులకు ఇద్దరు చొప్పున నామపత్రాలు అందజేశారు. వాటిని ఈనెల 17న పరిశీలించనున్నారు. 18వ తేదీ సాయంత్రం వరకు ఉపసంహరణకు గడువు ఉంది. ఈనెల 23న ఎన్నిక నిర్వహించనున్నారు. సంఘంలో 555 మంది సభ్యులు ఉన్నారు. టి.గంగాభవాని అధ్యక్షురాలిగా ఒక ప్యానల్, వి.ఉషారాణి అధ్యక్షురాలిగా మరో ప్యానల్ నామపత్రాలు దాఖలు చేశారు. దాదాపు 7ఏళ్ల విరామం తర్వాత నర్సుల సంఘానికి ఎన్నికలు జరుగుతుండడంతో కేజీహెచ్‌లో కోలాహలం నెలకొంది. సహకారశాఖ అధికారి పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరగనుంది.





నామపత్రాలు సమర్పిస్తున్న ఉషారాణి ప్యానల్ ప్రతినిధులు, గంగాభవాని ప్యానల్ సభ్యులు

వసతిగృహాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటశేషమ్మ

కంచరపాలెం, న్యూస్‌టుడే: కప్పరాడలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి ఎం.వెంకటశేషమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ఆమె మాట్లాడి... వసతి, భోజన సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జి.అఖిల, వసతి గృహ సిబ్బంది ఆర్.సీతారావు, ఎం.రామరాజు, గిరిశ్య తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణపై ఆరా

కంచరపాలెం, న్యూస్‌టుడే: దిల్లీ నుంచి వచ్చిన మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ అదనపు కార్యదర్శి త్రిషల్‌జిత్ సేథీ బుధవారం ప్రభుత్వ పాత ఐటీఐని సందర్శించారు. అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించారు. శిక్షణ తీరుతెన్నులపై ఆరా తీసి, ప్రయోగాలను పరిశీలించారు. ఐటీఐల ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ, ఐ.ఎం.సి.చైర్మన్ బి.ఎస్.బి.ప్రభాకరరావు, వైస్ ప్రిన్సిపల్ వై.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి నైపుణ్యాన్ని పరీక్షిస్తున్న త్రిషల్‌జిత్ సేథీ

చేతుల పరిశుభ్రతపై అవగాహన



చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

గురుద్వారా, న్యూస్‌టుడే: ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీపీటీకాలనీ ఎన్ఏడీహెచ్ పాఠశాలలో బుధవారం చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ పర్యవేక్షక అధికారి సురేంద్ర విద్యార్థులకు రోజూ భోజనం చేసేముందు, ఆటలు ఆడిన తర్వాత చేతులు తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. అలా చేయకుంటే బ్యాక్టీరియా మన చేతుల్లోకి వెళ్లి రోగాల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు పైడమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'పంప్‌డ్ స్టోరేజీ'లతో నీటి వనరులు కనుమరుగు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తూర్పు కనుమల్లో ఏపీ ప్రభుత్వం మంజూరు చేసిన పంప్‌డ్ స్టోరేజ్ స్కీమ్‌లను రద్దు చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ కోరారు. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి లీనానందన్‌కు బుధవారం లేఖ రాశారు. కేరళలోని పశ్చిమ కనుమల్లో ఉన్న వయనాడ్‌లో జీవిఎల కొండ చరియలు విరిగిపడి విపత్తు సంభవించిన దృష్ట్యా మహారాష్ట్రలోని పశ్చిమకనుమల్లో అదానీ గ్రూపు ప్రతిపాదించిన 1500 మెగావాట్ స్టోరేజ్ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టుకు అనుమతి నిరాకరించారని, దీన్ని తాను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇదే తరహాలో తూర్పు కనుమల్లో మంజూరు చేసిన పంప్‌డ్ స్టోరేజ్ స్కీమ్‌లను రద్దు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుల వల్ల స్థానికంగా అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులు కనుమరుగవుతాయన్నారు. గత ఏపీ ప్రభుత్వం స్థానిక గిరిజన గ్రామసభలను సంప్రదించకుండా రెండు ముఖ్యమైన కేంద్ర చట్టాలను ఉల్లంఘించిందని ఆయన కేంద్ర కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే: దువ్వాడ వీసెజ్‌లోని సినర్జీస్ కాస్టింగ్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ఆరు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని సిటూ నాయకుడు ఎం.రాంబాబు ఆరోపించారు. వేతనాలపై ప్రశ్నించిన కార్మికుల్ని విధుల నుంచి తొలగిస్తామని యాజమాన్యం బెదిరిస్తోందన్నారు. బుధవారం సంస్థ గేటు వద్ద సిటూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలో పని చేస్తున్న సుమారు 950 మంది కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మధ్యాహ్నం బి-షిఫ్టుకు వచ్చిన కార్మికులు పని శ్రమ గేటు వద్ద ఆందోళనకు దిగడంతో ఏ-షిఫ్టుకు వచ్చిన వారంతా సంస్థ లోపలే ఉండిపోయారు. రాత్రి పది గంటల వరకు ఆందోళన కొనసాగింది. యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోతే రాత్రంతా ధర్నా కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. సిటూ నాయకులు దత్తాత్రేయ, నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిటూ నాయకులు, కార్మికులు

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

18న రక్తదాన శిబిరం

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఈనెల 18న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బుధవారం వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చేతుల మీదుగా గోడపత్రిక, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కాకి కుంచారావు వర్ధంతి సందర్భంగా గ్రామంలో కుంచారావు మిత్రమండలి, అమ్మ బ్లడ్‌బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తామన్నారు.


గోడపత్రిక ఆవిష్కరించిన సభ్యులు

మద్యం విక్రయాలు ప్రారంభం

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ప్రభుత్వం నిర్వహించిన లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు బుధవారం సాయంత్రం నుంచి విక్రయాలు ప్రారంభించారు. కొత్తపాలెం, గోపాలపట్నం పెట్రోల్ బంకు, ఎన్‌ఏడీకూడలిలో దుకాణాలకు సాయంత్రం వరకు మద్యం నిల్వలు రాకపోవడంతో నిర్వాహకులు, మద్యం తాగేవారు నిరీక్షించారు. స్టాక్ రాగానే ఒక్కసారిగా తోపులాటలు జరిగాయి. కొత్తపాలెం కూడలిలో రెండు దుకాణాలు ఏర్పాటు చేయడంతో... ఆయా నిర్వాహకుల మధ్య వాగ్వాదం జరిగింది. అధికారులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.


కొత్తపాలెంలో దుకాణం వద్ద రద్దీ


రోడ్డు పక్కన ఇలా...

దారులు.. నిలిపేస్తున్నారు లారీలు..!

న్యూస్‌టుడే, కూర్మన్నపాలెం

గాజువాక సమీప ఆటోనగర్‌లో ప్రధాన రహదారులన్నీ పార్కింగ్ యార్డులుగా మారుతున్నాయి. ఏ బ్లాక్ మార్గాలను చూసినా... ఇరువైపులా భారీ వాహనాలను నిలిపి ఉంచడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఆటోనగర్‌లోని 8 బ్లాక్‌లు, అపెరల్ పార్కులో కలిపి మొత్తం 1200 వరకు పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో సరకు ఎగుమతి, దిగుమతి కోసం వచ్చిన లారీలు, ట్రైలర్లు, కంటైనర్లను ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే ఆపేస్తున్నారు. బి-బ్లాక్‌లో పార్కింగ్ యార్డు ఉన్నా... వాహనాలన్నీ రహదారులపైనే ఉంటున్నాయి.

ఆటోనగర్‌లో అడ్డదిడ్డంగా పార్కింగ్

పరిశీలన

వసూళ్లకే పరిమితం..!: వాహన పార్కింగ్ ఆశీలు వసూళ్లకు టెండర్ దక్కించుకున్న గుత్తేదారు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఆయా వాహనాలను యార్డుకు తరలించేలా పర్యవేక్షించి, అక్కడ పార్కింగ్ చేసిన తర్వాత రుసుము వసూలు చేయాలి.

● కాని వాహనాల్ని యార్డుకు తరలించకుండానే... రహదారుల వెంబడి నిలిపి ఉంచినా ఆశీలు తీసుకుంటున్నారు. ఈ అంశం సంబంధిత అధికారులకు తెలిసినా... పట్టించుకోవడం లేదని, దీంతో వాహనాలన్నీ రోడ్లపైనే ఉంటున్నాయని పలువురు చెబుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణేది..?: పరిశ్రమల ప్రాంత రహదారుల్లో భారీ వాహనాలు నిలిపి ఉంచకుండా... ట్రాఫిక్ పోలీసులూ నిఘా ఉంచాల్సి ఉంది. కాని ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే పోలీసులు హడావుడి చేసి, ఆ తర్వాత ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించడం లేదు. దీంతో నిత్యం రాకపోకలు సాగించే కార్మికులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

దీపాల్లేక అంధకారం..: రాత్రి సమయాల్లో ఆటోనగర్ రహదారుల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో బి, సి షిఫ్టుల్లో పని చేసే వారి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పలువురు ద్విచక్ర వాహనచోదకులు రహదారి పక్కన నిలిపి ఉంచిన భారీ వాహనాలను గమనించక... వేగంగా వెళ్లి ఢీకొడుతున్నారు. అపెరల్ పార్కు ప్రధాన రహదారిలో కొద్ది నెలల నుంచి దీపాలు వెలగకపోయినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

● కణితి నిర్వాసిత కాలనీలు, కూర్మన్నపాలెం, అగనంపూడి, దువ్వాడ, మంగళపాలెం ప్రాంతాలకు చెందిన వారంతా నిత్యం ఆ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా సమస్యలపై పలుమార్లు విన్నవించినా... సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా పరిష్కారాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


ఆటోనగర్ ప్రధాన రహదారిలో..

అరకొర నిర్వహణ.. అందని వైద్యం..!

గుల్లలపాలెం ఎఫ్‌ఆర్‌యూలో రోగులకు అవస్థలు

న్యూస్‌టుడే, సింధియా

పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం సమీప గుల్లలపాలెం ఫస్ట్ రిఫరల్ యూనిట్ (ఎఫ్.ఆర్.యు) ఆసుపత్రి నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ హయాంలో నగరంలోని ఆరిలోవ, గుల్లలపాలెంలో పేదలకు వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రులు ఏర్పాటు చేశారు.

గుల్లలపాలెం ఆసుపత్రిని సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం, హిమాచల్‌నగర్ తదితర ప్రాంతాల రోగులు సద్వినియోగం చేసుకునేవారు. కొన్నాళ్ల పాటు జీవీఎంసీ ఆధ్వర్యంలోనే సేవలు అందాయి. ఆ తర్వాత ప్రభుత్వాల నిర్ణయాలతో ప్రైవేట్ సేవా సంస్థకు ఓసారి, తర్వాత రెడ్‌క్రాస్ సొసైటీకి, ఆ తర్వాత మరో సేవా సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

● రెండేళ్ల నుంచి మాత్రం గోపాలపట్నానికి చెందిన ఒక ప్రైవేట్ ఆసుపత్రికి నిర్వహణ బాధ్యతలు అప్పగించి, ప్రతి నెలా దాదాపు రూ. 8.5 లక్షలను బిల్లుల రూపంలో ప్రభుత్వం చెల్లిస్తుంది.

● నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వారు గత నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని ఆసుపత్రి సిబ్బంది వాపోతున్నారు.


ఆసుపత్రిలో నిరీక్షిస్తున్న రోగులు

రోగులకు అవసరమైన కనీస మందులు అందుబాటులో ఉండడం లేదు.

● ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. జీవీఎంసీ ఆధ్వర్యంలోనే ఆసుపత్రి నిర్వహణ కొనసాగిస్తూ, మెరుగైన సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రమదోపిడీపై కార్మికుల ఆగ్రహం

సింధియా, న్యూస్‌టుడే : హెచ్‌పీసీఎల్‌కు చెందిన విశాఖ్ రిఫైనరీలో శ్రమదోపిడీ జరుగుతోందని బుధవారం ఒప్పంద కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒప్పంద కార్మికుల సంక్షేమాన్ని... కొన్ని కార్మిక సంఘాలు గాలికొదిలేశాయని ఆరోపించారు. కొందరు నాయకులు గుత్తేదారులతో చేతులు కలిపి కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. దీంతో రిఫైనరీ ప్రాజెక్టులో ఏటా షట్‌డౌన్ పనులు పూర్తయ్యాక తుది చెల్లింపుల్లో కార్మికులకు మొండిచేయి చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు 'స్థానిక ఉపాధి' అంశాన్ని నిర్లక్ష్యం చేస్తూ, ఇతర ప్రాంత కార్మికులతో పనులు చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రిఫైనరీలో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘనపై దర్యాప్తు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులకు ఉత్తమ అవార్డులు దక్కాయని రెక్టార్ వి.మధుసూదనరావు బుధవారం తెలిపారు. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటేషన్స్ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు-జె.సుధాకర్‌కు, బెస్ట్ లీడర్ ఆఫ్ ది ఇయర్ ఎక్సలెన్సీ ఇన్ టీచింగ్ అవార్డు-వైస్ ప్రిన్సిపల్ పీఎస్ రవీంద్రకు, ఎక్సలెన్స్ ఇన్ స్టూడెంట్స్ ప్లేస్‌మెంట్ అండ్ కెరియర్ డెవలప్‌మెంట్ అవార్డు- ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ డీన్ బోడే ప్రసాద్‌కు దక్కాయన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.శ్రవంతికి ఉత్తమ సలహాదారు, కె.దుర్గాశ్రామ్ ప్రసాద్‌కు ఉత్తమ ఇన్నోవేటివ్ పెడగోజీ అవార్డులు వచ్చాయన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : దువ్వాడ వీసెజ్‌లోని సినర్జీస్ కాస్టింగ్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు ఆరు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని సిటూ నాయకుడు ఎం.రాంబాబు ఆరోపించారు. వేతనాలపై ప్రశ్నించిన కార్మికుల్ని విధుల నుంచి తొలగిస్తామని యాజమాన్యం బెదిరిస్తుందన్నారు. బుధవారం సంస్థ గేటు వద్ద సిటూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలో పని చేస్తున్న సుమారు 950 మంది కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మధ్యాహ్నం బి-షిఫ్ట్‌కు వచ్చిన కార్మికులు పరిశ్రమ గేటు వద్ద ఆందోళనకు దిగడంతో ఏ-షిఫ్ట్‌కు వచ్చిన వారంతా సంస్థ లోపలే ఉండిపోయారు. రాత్రి పది గంటల వరకు ఆందోళన కొనసాగింది. యాజమాన్యం సానుకూలంగా స్పందించకపోతే రాత్రంతా ధర్నా కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. సిటూ నాయకులు దత్తాత్రేయ, నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సిటూ నాయకులు, కార్మికులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

రహదారి అధ్వానం..: పీలానగర్ సమీప వెంకటేశ్వరకాలనీ రోడ్డు నెంబరు-1లో గోతులు ఏర్పడ్డాయి. మార్గానికి ఇరువైపులా ముళ్ల తుప్పలతో ఇబ్బందులు పడుతున్నాం. **–ఇమ్మానుయేల్, వెంకటేశ్వరకాలనీ**

సమాధానం: పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **–అప్పారావు, ఈఈ.**

దీపాలు వెలిగించరూ..?: జీవీఎంసీ 65వ వార్డు దిబ్బపాలెం, యాతపాలెంలో వీధి దీపాలు పడకేశాయి. చీకటి కష్టాలు తీర్చాలి. **–గణేశ్, దిబ్బపాలెం**

✔: పాడైన దీపాలను బాగు చేయిస్తాం. **–శివ, వీధి దీపాల నిర్వాహకుడు.**

నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం


భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గణబాబు, కోరమాండల్ ప్రతినిధులు

సింధియా, న్యూస్‌టుడే : విద్యార్థులు, యువత నైపుణ్య శిక్షణకు పారిశ్రామిక వర్గాలు చేయూత ఇవ్వాలని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 58వ వార్డు ఏదురువానిపాలెంలో కోరమాండల్ సీఎస్సార్ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ముఖ్యఅతిధి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి సంస్థ సాధించే లాభాల్లో 2 శాతం నిధులు సామాజిక బాధ్యతగా ఖర్చు చేయాలని సూచించారు. కేంద్ర ప్రవేశపెట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో పక్కాగా అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అనంతరం స్థానిక మహిళలకు దుప్పట్లు, వస్త్ర సంచులు పంపిణీ చేశారు. కోరమాండల్ సీఎస్సార్ ప్రతినిధి జయగోపాల్, యూనిట్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, డీజీఎం(హెచ్ఆర్) ఆర్.శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, సీఎస్ఓ నారాయణపాత్రుడు, నాయకులు వెంకటరమణ, దుర్గాప్రశాంతి, శ్రీనివాస్, జోజిబాబు పాల్గొన్నారు.

'ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి'


శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని పోరాట కమిటీ నాయకుడు యు.రామస్వామి డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో కొనసాగుతున్న రిలే దీక్షలు బుధవారం 1343వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తే విలీన ప్రక్రియ సాధ్యమవుతుందన్నారు. ముడి సరకు కొరతతో ఉత్పత్తికి అడ్డంకులు ఎదురవుతున్నాయని, పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బోనస్ చెల్లింపుపై యాజమాన్య నిర్ణయానికి వ్యతిరేకంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిటూ నాయకులు ఎన్.రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, భానుమూర్తి, గంగాధర్, నీలకంఠం, వెంకట్రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

గోపాలపట్నం, ఎన్‌ఏడీకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు పరిధి భగత్‌సింగ్‌నగర్‌లో రూ. 17 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించే కాలువ నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ శంకుస్థాపన చేశారు. వార్డు తెదేపా అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, ప్రజా పనుల విభాగం ఏఈ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

● జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో రూ. 10 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. స్థానిక కొండవాలు మంచినీటి ట్యాంకు రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు.


భగత్‌సింగ్‌నగర్‌లో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటరమేశ్

ధరలు నియంత్రించాలి : సీపీఐ

షిప్‌యార్డుకాలనీ(మల్కాపురం), న్యూస్‌టుడే : పెరిగిన నిత్యావసరాల ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ పశ్చిమం ఇన్‌ఛార్జి సత్యాంజనేయ డిమాండ్ చేశారు. జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డుకాలనీలో బుధవారం పార్టీ శ్రేణులు నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని కోరారు. నాయకులు రాంబాబు, గోపి, బాలాజీ, నాగేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం కూడలిలో శ్రీ కొండదేవతమ్మ ఆటోస్టాండ్ కమిటీ ఆధ్వర్యంలో శరన్నవరాత్రులు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ప్రారంభించారు. సభ్యులు రాజు, నర్సింగరావు, అప్పన్న, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే : విద్యార్థుల ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, ఈ మేరకు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటీషన్స్ (సీఎస్‌సీ) సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జె.సుధాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం దువ్వాడ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. సీఎస్‌సీ సంస్థ సలహాదారు వై.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధి నైపుణ్యాలు, పారిశ్రామిక శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యాపకులు శ్యామ్‌ప్రసాద్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నృత్యప్రదర్శనలు


నాట్యారాధన కళాకారులు

గాజువాక, న్యూస్‌టుడే: కేరళ తిరువనంతపురం అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఈనెల 20న కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరగనున్నాయి. ఈ మేరకు గాజువాక నాట్యారాధన మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ కళాకారులకు బుధవారం ఆహ్వానం అందింది. నాట్యగురువు నంబాల జ్యోతి నేతృత్వంలో 13 మంది కళాకారులు శ్రీవారి కల్యాణ ఘట్టం, కూచిపూడి నృత్య రూపకాలు, ఇతర నృత్యాలతో అలరించేందుకు సాధన ప్రారంభించారు. ఇటీవల శరన్నవరాత్రి ఉత్సవాల్లో వారి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : విశాఖ నగరంలోని రుషికొండలో తితిదే నిర్వహణలోని గోదాలక్ష్మి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో గాజువాక కళారాధన అకాడమీ కళాకారులు బుధవారం నృత్య ప్రదర్శనతో అలరించారు. శ్రీనివాస కల్యాణం, అష్టలక్ష్ములు, బ్రహ్మోత్సవ వైభవం వంటి రూపకాలతో ఆకట్టుకున్నారు. నాట్యగురువు తాళ్లపాక సందీప్‌కుమార్ పర్యవేక్షణలో 12 మంది నృత్యప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా కళాకారులను దేవస్థాన కమిటీ ప్రతినిధులు సత్కరించారు.


కళారాధన అకాడమీలో శిక్షణ పొందుతున్న వారు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: వివాహ వేడుకలో విద్యుత్తు పనులు చేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఆ వివరాలిలా.. రేవళ్లపాలెం గ్రామానికి చెందిన బెవర సరస్వతి భర్త మరణించడంతో ఇంటి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తోంది. పెద్ద కొడుకు అనిల్‌కుమార్ వాలంటీర్‌గా పని చేస్తూ ఎన్నికల ముందు రాజీనామా చేశాడు. చిన్న కుమారుడు బెవర సాయికుమార్(22) కొమ్మాది దేవీమెట్ట ప్రాంతానికి చెందిన ఓ ఈవెంట్ నిర్వాహకుడి వద్ద పని చేస్తున్నాడు. కొమ్మాదిలో బుధవారం రాత్రి ఓ వివాహ వేడుకకు సంబంధించి విద్యుత్తు పనులు చేస్తుండగా సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆ తర్వాత వివాహ వేదిక వద్ద విద్యుత్తు తీగలు కలుపుతుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సమీప ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్ శవాగారానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నర్సుల సంఘానికి ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలకు సంబంధించి బుధవారం నామపత్రాలు దాఖలయ్యాయి. రెండు ప్యానళ్లకు చెందిన 19 మంది నామపత్రాలు అందజేశారని ఎన్నికల అధికారి, సహకారశాఖ సహాయ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యదర్శి పోస్టుకు ముగ్గురు, అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారి, కార్యవర్గ సభ్యుల పదవులకు ఇద్దరు చొప్పున నామపత్రాలు అందజేశారు. వాటిని ఈనెల 17న పరిశీలించనున్నారు. 18వ తేదీ సాయంత్రం వరకు ఉపసంహరణకు గడువు ఉంది. ఈనెల 23న ఎన్నిక నిర్వహించనున్నారు. సంఘంలో 555 మంది సభ్యులు ఉన్నారు. టి.గంగాభవాని అధ్యక్షురాలిగా ఒక ప్యానల్, వి.ఉషారాణి అధ్యక్షురాలిగా ఒక ప్యానల్ నామపత్రాలు దాఖలు చేశారు.

సంక్షిప్త సమాచారం..

● రాష్ట్రాభివృద్ధిపై దృష్టి : ఎమ్మెల్యే

గోపాలపట్నం, న్యూస్‌టుడే : రాష్ట్రాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. బుధవారం గోపాలపట్నం తెదేపా కార్యాలయంలో 'పార్టీ సభ్యత్వ నమోదు'పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయి కమిటీ నుంచి నియోజకవర్గస్థాయి కమిటీ సభ్యులంతా సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అత్యధికంగా సభ్యత్వ నమోదులు చేయించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● వివాహిత ఆత్మహత్య

సింధియా, న్యూస్‌టుడే : వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాలు... బిహార్‌లోని పాట్నాకు చెందిన విక్కీకుమార్ విశాఖపట్నం నౌకాదళంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఝార్ఖండ్‌కు చెందిన కుసుమకుమారి(28)తో 2020లో వివాహమైంది. వారు స్థానిక బర్మాకాలనీలో నివాసం ఉంటున్నారు. ఉదయం విక్కీకుమార్ విధులకు వెళ్లగా, 10.30 గంటల సమయంలో కుసుమకుమారి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు, నేవీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్ పర్యవేక్షణలో సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

● నూతన నియామకం


నియామక పత్రం అందుకుంటున్న వినోద్‌బాలు

గాజువాక, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ శరీర అవయవ దాతల సంఘం ప్రధాన కార్యదర్శిగా గాజువాకకు చెందిన వినోద్‌బాలు నియమితులయ్యారు. బుధవారం సావిత్రిబాయి పులే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ గూటూరు సీతామహాలక్ష్మి నియామక ఉత్తర్వులు అందించారు.

● తరలిన తెదేపా శ్రేణులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఆటోనగర్ గ్రీన్ సిటీ ఫంక్షన్ హాల్లో బుధవారం కూటమి ఆత్మీయ సమావేశానికి పెదగంట్యాడ ఉక్కు నిర్వాసిత కాలనీల నుంచి తెదేపా శ్రేణులు ర్యాలీగా తరలివెళ్లాయి, నెల్లిముక్కు తెదేపా కార్యాలయం వద్ద పార్టీ నగర ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఎస్సీ సెల్ కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య అధ్యక్షత వహించారు. నాయకులు అప్పారావు, పెరుమాళ్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

● రిఫైనరీలో మాక్‌డ్రిల్

సింధియా, న్యూస్‌టుడే : హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్‌కు చెందిన 'విశాఖ్ రిఫైనరీ'లో బుధవారం సాయంత్రం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆ సమయంలో అత్యవసర సైరన్లు మోగడంతో సమీప ప్రాంత నివాసితులు బెంబేలెత్తిపోయారు. సంస్థ లోపల ఏదైనా ప్రమాదం జరిగిందేమోనని ఆరా తీయగా, మాక్‌డ్రిల్ జరిగినట్టు కార్మికులు చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

'చిత్తశుద్ధితో పోరాడాలి'

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు–3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కులో కొందరు కార్మిక నాయకులు ఉద్యమ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని జనసేన నాయకుడు పల్లా కార్తీక్ బుధవారం ఆరోపించారు. పోరాటం ముసుగులో కోట్ల రూపాయలు వెనకేసుకుంటూ, కర్మాగారంపై ఆధారపడి ఉన్న కార్మికుల్ని, నిర్వాసితుల్ని మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో పోరాటాలు చేయాలని, లేనిపక్షంలో స్వచ్ఛందంగా ఉద్యమం నుంచి తప్పుకోవాలని సూచించారు.

ఏయూ మైదానంలో టపాసుల దుకాణాల ఏర్పాటులో తప్పేముంది: హైకోర్టు

ఈనాడు, అమరావతి: విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) మైదానంలో దీపావళికి టపాసులను విక్రయించేందుకు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వకుండా అధికారులను నిలువరించాలంటూ పిటిషనర్ చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. దీపావళి సందర్భంగా మూడు రోజులపాటు జనావాసాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేస్తే తప్పేముందని వ్యాఖ్యానించింది. పిటిషనర్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లో మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు స్పష్టంచేసింది. విచారణను నవంబర్ 1కి వాయిదా వేసింది.

● ఏయూ పరిధిలోని 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న 1500 చెట్లను కూల్చివేశారని, అందుకు అటవీశాఖ అధికారుల అనుమతి లేదని, వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధంగా కొట్టేశారని, కుంటలు, నీటి ప్రవాహ ప్రాంతాలను(గెడ్డలను) పూడ్చి వేస్తున్నారని పేర్కొంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ 2022లో హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో తాజాగా అనుబంధ పిటిషన్ వేస్తూ.. దీపావళికి టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఏయూ మైదానంలో భూమిని చదును చేస్తున్నారన్నారు. మైదానానికి సమీపంలో విద్యార్థుల వసతిగృహం ఉందన్నారు. ఏయూ, జిల్లా కలెక్టర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 15 ఏళ్లుగా ఆ మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. జనావాసాలకు దూరంగా అదే సురక్షిత ప్రాంతమన్నారు. కేవలం మూడు రోజులు మాత్రమే దుకాణాలకు అనుమతిస్తున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం దుకాణాల ఏర్పాటును నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. అనుబంధ పిటిషన్ నిరర్థకం అయ్యేందుకు ఉద్దేశపూర్వకంగానే విచారణను నవంబర్ 1కి వాయిదా వేస్తున్నట్లు వ్యాఖ్యానించింది.

గాజువాక సినిమాలు

కన్య: **దేవర**, హెవెన్: **జనక అయితే గనక..** శ్రీకన్య, లక్ష్మి, హెవెన్, అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం): **వేట్టయన్**, మోహినీ 70ఎంఎం: **విశ్వం** లక్ష్మీకాంత్: **స్వాగ్**, మినీ మోహినీ: **మార్టిన్**, మోహినీ: **జిగ్రా**, విశేష్: **మా నాన్న సూపర్ హీరో**

ఎస్టీబీఎల్‌లో: స్క్రీన్-2: **వేట్టయన్** స్క్రీన్-3: **విశ్వం**, స్క్రీన్-4: **దేవర** స్క్రీన్-1: **మార్టిన్**

గోపాలపట్నంలో: శ్రీనరసింహా: **జనక అయితే గనక**, నరసింహా: **వేట్టయన్** సౌజన్య: **విశ్వం**, సుకన్య: **దేవర** మౌర్య: **మా నాన్న సూపర్‌హీరో**

వ్యర్థాలు తరలించరూ..!

ఫోకస్

పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం సచివాలయం ఎదురుగా ఉన్న ప్రజా మరుగుదొడ్ల పక్కన పేరుకుపోయిన వ్యర్థాల కుప్పలతో తీవ్ర దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. సమీప గెడ్డలోంచి తొలగించిన వ్యర్థాలను సకాలంలో తరలించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వారు చెబుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని, వెంటనే శుభ్రత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **–న్యూస్‌టుడే, సింధియా**



సేవలు మరువలేనివి


సాయిబాబాకు నివాళి అర్పిస్తున్న సంఘం సభ్యులు

ఎన్‌ఏడీకూడలి(కరాస), న్యూస్‌టుడే : విద్యావేత్త, మానవ హక్కుల కార్యకర్త ప్రొఫెసర్ జీఎస్.సాయిబాబా సేవలు మరువలేనివని విరసం ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త బూసి వెంకట్రావు అన్నారు. బుధవారం మర్రిపాలెంలోని ఈస్టర్న్ నేవల్ కమాండ్ పింఛనుదారుల కార్యాలయంలో సాయిబాబా చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాజంలో బడుగుల సమస్యల్ని పరిష్కరించేందుకు సాయిబాబా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. సంఘం సభ్యులు సుధాకర్, హరిబాబు, ఓంకార్, విజయనిర్మల, భాస్కరరావు, ప్రసాద్, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.